తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## కన్నుల పండుగలా ధ్వజారోహణం

### -సింహవాహనంపై శివయ్య



చౌడేపల్లి, మే 14 ప్రభాతవార్త

పట్టణంలోని అభీష్టధ మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం ధ్వజారోహణం, రాత్రి సింహవాహన సేవలు కన్నుల పండుగలా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు రాజశేఖర్‌దీక్షితులు ఆధ్వర్యంలో స్వామివారికి విశేషాభిషేకం, అలంకరణ గావించారు. ధ్వజారోహణానికి పద్మశాలి, సింహ వాహనానికి విశ్వబ్రాహ్మణ కులస్తులు ఉభయ దారులుగా వ్యవహరించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు.

## ఓట్ల లెక్కలతో కుస్తీ పడుతున్న నేతలు

### - పెరిగిన ఓట్ల శాతంతో తర్జనభర్జనలు !!

కుప్పం, మే 14 ప్రభాతవార్త

ఓ పక్క ఎండల వేడి.. మరో పక్క ఎన్నికల హోరులో ఇన్నాళ్లూ తలమునకలైన వైకాపా, తెదేపా శ్రేణులు ఇప్పుడు పెరిగిన ఓట్ల శాతంపై లెక్కలు వేస్తూ కుస్తీలు పడుతున్నారు. సోమవారంతో ఎన్నికలు ముగిసినా మంగళవారం నాటికి జిల్లాలో పూర్తిస్థాయిలో పోలైన ఓట్ల వివరాలను ఎన్నికల అధికారులు వెల్లడించారు. చిత్తూరు జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో పెరిగిన ఓట్ల శాతం ఎవరికి లాభిస్తుందోననే అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గత ఎన్నికలతో పోల్చితే ఈసారి నియోజకవర్గాల్లో ఓట్ల శాతం కొంత పెరగడమే ఇందుకు కారణం. జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఓట్ల శాతం పరిశీలిస్తే కుప్పంలో అత్యధికంగా 89.88శాతం మేర ఓట్లు పోలయ్యాయి. అలాగే జిడి నెల్లూరు (ఎస్సీ)లో 88.69శాతం, పలమనేరు 87.9, నగరి 87.08, పూతలపట్టు (ఎస్సీ)87.66, పుంగనూరు 86.62, అత్యల్పంగా చిత్తూరులో 81.24 శాతం మేర ఓట్లు పోలయ్యాయి. ఈ గణాంకాలే ఇప్పుడు నేతలకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. పెరిగిన ఓట్ల శాతం తమకే లాభిస్తుందని తెలుగుదేశం పార్టీ శ్రేణులు పేర్కొ ంటున్నాయి.

# తిరుపతిలో హైటెన్షన్

**చంద్రగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిపై దాడి... కారు ధ్వంసం**
**గన్‌మెన్‌కి గాయాలు...గాలిలో కాల్పులు - అస్వస్థతకు గురైన పులివర్తి నాని**
**ప్రజలు, మీడియా ప్రతినిధులపై పోలీసులు లారీచార్జి - మహిళ విశ్వవిద్యాలయం వద్ద భయాందోళనకర వాతావరణం**



తిరుపతి స్విమ్స్ ఆసుపత్రి ఎమర్జెన్సీ వార్డులో చికిత్స పొందుతున్న చంద్రగిరి తెలుగుదేశం ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని











తిరుపతిరూరల్, మే 14 ప్రభాతవార్త:

తిరుపతిలో హైటెన్షన్ నెలకొంది. శ్రీపద్మావతి మహిళ విశ్వవిద్యాలయం వద్ద చంద్రగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిపై వైసిపి నాయకులు ఇనుపరాడ్లు, బీరుబాటిల్స్ దాడి చేసారు. దాడిలో నాని కారును ధ్వంసం చేయడంతో పాటు, అడ్డువచ్చిన గన్‌మెన్ ధరణిని గాయపరిచారు. మంగళవారం మహిళా వర్సిటీలో ఈవిఎంల స్ట్రాంగ్ రూమ్ పరిశీలనకు వచ్చిన టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిపై వైసిపి నాయకులు విరుచుకుపడ్డారు. నాని మహిళ వర్సిటీ వస్తారనే ముందస్తు సమాచారంతో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అనుచరుడు, రామచంద్రాపురం జడ్పిటిసి భానుప్రకాష్‌రెడ్డి, అతని అనుచరులు ఉన్నఫలంగా మూకుమ్మడిగా నానిపై కారుపై దాడి చేసి, కారు అద్దాలను ధ్వంసం చేసారు. దీంతో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో భయాందోళనకర వాతావరణం నెలకొంది. ఆత్మరక్షణ కోసం గన్‌మెన్ ధరణి గాల్లో కాల్పులు జరిపారు. సమాచారం తెలుసుకున్న టిడిపి శ్రేణులు పెద్దఎత్తున మహిళ వర్సికి చేరుకుని పులివర్తి నానికి మద్దతుగా ధర్నా చేపట్టారు. చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న టిడిపి శ్రేణులతో పాటు, తిరుపతిలో ఉన్న టిడిపి శ్రేణులు కూడా మహిళ వర్సిటీకి చేరుకుని పులివర్తి నానికి అందోళన చేపట్టారు. ఓటమి భయంతోనే నానిపై దాడికి ప్రయత్నించారని ఆరోపించారు. పోలింగ్ ముగిసిన కొన్ని గంటలలోనే ఓటమి భయంతో పులివర్తి నానిపై హత్యాయత్నానికి వైసిపి నాయకులు పాల్పడ్డారని టిడిపి నాయకులు ఆరోపించారు.

### అస్వస్థతకు గురైన టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని

శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఈవిఎంల స్ట్రాంగ్ రూమ్‌లు పరిశీలనకు వచ్చిన పులివర్తి



నానిపై దాడికి నిరసనగా ఆందోళనకు దిగిన టిడిపి కార్యకర్తలు

నానిపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు హఠాత్తుగా దాడి చేయడంతో పులివర్తి నాని తీవ్ర అస్వస్థతకు గురైయ్యారు. తన కళ్ల ముందరే తాను ప్రయాణిస్తున్న కారును ధ్వంసం చేయడంతో పాటు, గన్‌మెన్‌ను ధరణిని గాయపరచడంతో స్పృహ కోల్పోయారు. స్పృహ కోల్పోయిన నానిని ప్రధమ చికిత్స నిమిత్తం స్విమ్స్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు.

### ఈవిఎం స్ట్రాంగ్‌రూమ్స్‌కు పటిష్ట భద్రత... నిలకడగా నాని ఆరోగ్యం : జిల్లా ఎస్పీ

చంద్రగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ఆరోగ్యం నిలకడగా ఉందని, స్విమ్స్ ఆసుపత్రిలో ఎమర్జెన్సీ వార్డులో చికిత్స అందిస్తున్నట్లు ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ తెలిపారు. శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో భద్రపరిచిన ఈవిఎం స్ట్రాంగ్‌రూమ్‌లకు మూడు అంచెల పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తిరుపతి జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ తెలిపారు. ఈవిఎం భద్రతపై ఎలాంటి ఆందోళన అవసరం లేదన్నారు. దాడి ఘటనపై ఎస్పీ మాట్లాడుతూ దాడిఘటన వీడియోలు పరిశీలించామని, దాడికి పాల్పడిన వారిపై ఫిర్యాదు కూడా అందిందని, కొన్ని గంటల్లోనే వారిని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేపడతామన్నారు.

### మహిళ వర్సిటీ వద్ద ఉద్రిక్త వాతావరణం

చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిపై హత్యాయత్నం జరిగిందన్న విషయం తెలియగానే టిడిపి శ్రేణులు పెద్దఎత్తున మహిళా వర్సిటీ చేరుకుని అందోళన కార్యక్రమాలు చేపట్టారు. ద్విచక్ర వాహనం బుల్లెట్‌ను కాల్చివేసారు. ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో పోలీసులు పెద్దఎత్తున మహిళా వర్సిటికి చేరుకుని లాఠీచార్జి చేసారు. ప్రజలు, మీడియా ప్రతినిధులపై లాఠీచార్జి చేయడంతో పలువురికి గాయాలైయ్యాయి.

### పులివర్తి నానికి పలువురు పరామర్శ

వైసిపి నాయకుల దాడిలో తీవ్ర అస్వస్థకు గురై స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిని టిడిపి సీనియర్ నాయకులు సైకం జయచంద్రారెడ్డి, బిజెపి నాయకులు భానుప్రకాష్‌రెడ్డిలు పరామర్శించారు. వైసిపి నాయకుల గుండాగురిని ఖండించారు. నానికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

## వైభవంగా గంగమ్మ జాతర ప్రారంభం

### ఉదయం అమ్మవారి విశ్వరూప స్తూపానికి విశేష అభిషేకాలు



తిరుపతి హెల్త్, మే 14, ప్రభాతవార్త

తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ జాతర వేడుకలు మొదలయ్యాయి. వారం రోజుల పాటు జరిగే జాతర వేడుకల్లో రోజుకో వేషంలో అమ్మవారి భక్తులు వేషాలతో మొక్కలు తీర్చుకుంటారు. జాతరకు తొలిగా మంగళవారం ఉదయం ఆలయంలో అమ్మవారి విశ్వరూప స్థూపానికి అభిషేకం నిర్వహించారు. రాత్రికి గంగమ్మ పుట్టిల్లు అవిలాల నుండి సారేను తీసుకువచ్చి ఆలయ అధికారులు, అర్చకులు, నిర్వాహకులు చాటింపు వేస్తారు. దీంతో జాతర వేడుకలు తిరుపతి నగరంలో మొదలు అవుతాయి. ఆలయంలో ప్రధానంగా రోజువారీ భక్తులు పొంగళ్ళు పెట్టి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. 21వ తేది మంగళవారం రాత్రికి జాతర అమ్మవారి విశ్వరూపం మట్టి చెంప నరుకుడుతో ముగుస్తాయి. ఎన్నికల కోడ్‌తో ఆలయ ఈఓ మమత ఆలయంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

## స్ట్రాంగ్ రూమ్‌కు చేరిన ఇవిఎంలు

### రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సీల్ వేసి భద్రం చేసిన రిటర్నింగ్ అధికారులు



చిత్తూరు, మే 14 ప్రభాతవార్త:

ఇవిఎంల ద్వారా ఓటరు వెల్లడించిన తన నిర్ణయంను వెల్లడించడానికి మరింత గడువు వుండటంతో ఎన్నికల అధికారులు ఇవిఎంలను జాగ్రత్తగా ఓట్ల లెక్కింపు కేంద్రాల్లోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రం చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తన ఓటు హక్కును విని యోగించుకొన్న ఇవిఎంలను అదే రోజు రాత్రి బూత్ పోలింగ్ ఆఫీసర్, ఎపిఓలు, ఓపిఓలు, సెక్టోరల్ ఆఫీసర్లు పోలీసుల భద్రత మధ్య చిత్తూరు ఎస్వీ సెట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రంకు తరలించారు. చిత్తూరు పార్లమెంటు స్థానంకు జరిగిన పోలింగ్ ఇవిఎంలతో పాటు చిత్తూరు పార్లమెంటు స్థానం పరిధిలోని చిత్తూరు, నగరి, జిడినెల్లూరు, పూతలపట్టు, కుప్పం, పలమనేరు, చద్రగిరి నియోజకవర్గాల ఇవిఎంలను ఓట్ల లెక్కింపు కేంద్రానికి భద్రంగా చేర్చారు. ఈ ఇవిఎంలను కలెక్టర్ సగిలి షన్మోహన్, ఎన్నికల పరిశీలకులు షాదీక్ ఆలం, నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేసి సీల్ వేసి స్ట్రాంగ్ రూమ్‌కు భద్రంగా చేర్చారు. అక్కడ సంబందిత నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల పరిశీలకులు పోలింగ్ కేంద్రాల నుండి తీసుకువచ్చిన ఇవిఎంలతో పాటు డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో అందించాల్సిన మిగిలిన అన్ని వివరాలు పోలింగ్ ఆఫీసర్ల నుండి తీసుకొన్నారు. ఆపై ఆయా నియోజకవర్గాలకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల పరిశీలకులు పోలింగ్ కేంద్రాల నుండి వచ్చిన ఇవిఎంలను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రం చేసి స్ట్రాంగ్ రూమ్‌కు సీల్ వేశారు. ఆపై స్ట్రాంగ్ రూమ్‌కు వున్న కరెంటు సరఫరాను సైతం తొలగించారు. స్ట్రాంగ్ రూమ్‌లో ఇప్పటికే ఓటరు వెల్లడించిన నిర్ణయం వున్న ఇవిఎంలు మరో 21 రోజుల పాటు చీకట్లో వుండనున్నాయి. మే 14వ తేదీ జరిగే ఓట్ల లెక్కింపు రోజు ఓటరు తాను వెల్లడించిన నిర్ణయంను ఇవిఎంలు బహిర్గతం చేయనున్నాయి.

#### పాకాల మండలంలో

## ఏనుగు బీభత్సం





ఏనుగు దాడిలో మృతి చెందిన కార్తవరాయన్, గ్రామాల్లో తిరుగుతున్న ఏనుగు

పాకాల, మే 14, ప్రభాతవార్త

పాకాల మండలం చెన్నుగారిపల్లి పంచాయితీ మణిపురెడ్డిపల్లి గ్రామంలో సోమవారం ఉదయం గ్రామం వెనుక ఏనుగు సంచరిస్తున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు కథనం మేరకు ఏనుగుని గమనించి ఆందోళనకు గురై అరువులు శబ్ధాలతో ఏనుగును తరిమే ప్రయత్నం చేశారు. ఏనుగు అలాగే పైకి వెళ్లి గుట్ట మలుపులో రాయి కొట్టే కార్మికుడు ఎం. కార్తవరాయన్ (52)పై దాడి చేసి చంపివేసింది. తర్వాత కొంత సమయానికి తిరిగి మరల ఊరువైపు వచ్చి మామిడి తోటలో విధ్వంసం సాగించింది. తర్వాత చెరువు వైపు వెళ్లి అటుగా వెళుతున్న ఇద్దరు యువకులపై దాడికి ప్రయత్నం చేసింది. ఏనుగు దాడిలో ఒక యువకుడికి చేయికి గాయమైంది. తర్వాత కొంత సమయానికి మరల ఊరి వైపు వచ్చి మామిడి తోటలకు ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ వైర్‌ను ఫెన్సింగ్ పోల్స్‌ను ధ్వంసం చేసి మణిపి రెడ్డి పల్లి కళ్యాణ మండపం దగ్గర ఉన్న రోడ్డు, రైల్వే ట్రాక్‌ను దాటి పాకాల చెరువు వైపు వెళ్లి ముద్దలపల్లి దళితవాడ దగ్గర మామిడి తోటలో విధ్వంసం చేసి అక్కడ ఉండే అరటి చెట్లు రైతుకు తీవ్రంగా నష్టం కలిగించింది. అక్కడి నుంచి ఇరంగారిపల్లి గుట్టవైపు వెళ్లిందని స్థానికుల సమాచారం. ఈ ఘటనపై అటవీ శాఖఅధికారులు స్పందించి ఏనుగును బంధించి అడవులలోవదిలివేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## అనుమానం పెనుభూతమై...!

### - భార్యపై భర్త హత్యాయత్నం



భర్త చేతిలో కత్తి పోట్లకు గురై కుప్పకూలిన భార్య స్వాతి

యాదమరి, మే 14 ప్రభాతవార్త:

ఆ భర్తకు అనుమానమే పెనుభూతంగా మారింది. ప్రతి దానికి భార్యను అనుమానించేవాడు. ఈ క్రమంలో మంగళవారం ఇంటి సరుకులు కొనుగోలు చేసుకోవాలని భర్త వద్ద డబ్బులు తీసుకొని వెళ్ళాలని వచ్చిన భార్యపై భర్త కత్తితో నరికి చంపడానికి ప్రయత్నించడం ముత్తరపల్లి పరిసరాల్లో సంచలనంగా మారింది. వివరాలిలా వున్నాయి. గుడిపాల మండలం పేయనపల్లి గ్రామంకు చెందిన ఉమాపతి(35), స్వాతి(29)లు భార్యభర్తలు. వీరికి పదేళ్ళ క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు, ఒక కుమార్తె వున్నారు. ఉమాపతి జెసిబి మెకానిక్‌గా పనిచేస్తుండటంతో నగరానికి సమీపంలో వుంటే బాగుంటుందని భావించి పేయనపల్లి నుండి చిత్తూరు జానకారపల్లికి కాపురంను మార్చాడు. అప్పటి నుండి ఉమాపతికి భార్య స్వాతిపై అనుమానం ప్రారంభమైంది. ప్రతి విషయానికి భర్త తనను అనుమానిస్తుండటంతో భార్య స్వాతి మిన్నకుండిపోయేది. ఈ క్రమంలో భర్త ముత్తరపల్లి వద్ద వున్న జెసిబి మెకానిక్ షెడ్‌లో పనిచేస్తున్నాడని తెలియడంతో అతని నుండి డబ్బులు తీసుకెళ్ళడానికి భార్య స్వాతి మంగళవారం ఉదయం 11 గంటలకు వచ్చింది. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఉమాపతి, స్వాతిల మధ్య వాగ్వివాదం ప్రారంభమై పెద్దదైంది. ఈ క్రమంలో భర్త ఉమాపతి తన జేబులో వున్న కత్తిని తీసి తన భార్య స్వాతి మెడ, కాలిపై నరికివేయడంతో ఆమె కుప్పకూలిపోయింది. భార్యపై దాడి చేసిన ఉమాపతి అక్కడి నుండి పరారయ్యాడు. స్థానికులు ఈ విషయంను యాదమరి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి హుటాహుటిన చేరుకొని తీవ్రంగా గాయపడిన స్వాతిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుండి మెరుగైన చికిత్స నిమిత్తం ఆమెను వేలూరు సిఎంసి ఆసుపత్రికి తరలించారు. యాదమరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విజేతలు ఎవరు!

**- స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రంగా అభ్యర్థుల జాతకాలు**
**పోలింగ్ శాతం పెరగడంతో గెలుపు తమదేనని ఇరు పార్టీల అభ్యర్థుల్లో ధీమా**
**- ఫలితాల కోసం మరో 21 రోజుల పాటు తప్పని నిరీక్షణ**

చిత్తూరు, మే 14 ప్రభాతవార్త: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో ఓటర్లు ఇవిఎంల ద్వారా వెల్లడించిన నిర్ణయం స్ట్రాంగ్ రూమ్‌లకు చేరింది. ఓటర్లు ఇవిఎంల ద్వారా వ్యక్తపరచిన నిర్ణయంను వెల్లడికావడానికి ఎలక్షన్ కమీషన్ ఆదేశాల మేరకు మరో 21 రోజుల పాటు నిరీక్షించిక తప్పదు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో ఈ సారి భారీ ఎత్తున ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకొని ఓట్లు వేయడంతో ఓట్లు ఏ మేరకు పోలింగ్ అయ్యాయనే విషయం సోమవారం అర్ధరాత్రికి కాని తెలియని పరిస్థితి ఏర్పడింది. ఎట్టకేలకు జిల్లాలో అత్యధిక ఓటర్లు పోలింగ్‌లో పాల్గొని పోలింగ్ శాతంను గణనీయంగా పెంచారు. చిత్తూరు పార్లమెంటు స్థానం పరిధిలో రికార్డు స్థాయిలో 82.36 పోలింగ్ శాతం నమోదు అయితే చిత్తూరు అసెంబ్లీ స్థానాల పరిధిలో 82.65 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. ఇది వరకు పోలింగ్ శాతం తక్కువ నమోదు అయితే ప్రభుత్వంకు అనుకూలంగా ఓటింగ్ జరిగి వుంటుందని, ఒకవేళ పోలింగ్ శాతం అధికంగా నమోదు అయితే ప్రభుత్వ వ్యతిరేకత ఎక్కువగా వుండటంతో అన్ని వర్గాల ప్రజలు వున్న ప్రభుత్వంను గద్దె దింపాలనే కసితో పోలింగ్‌లో పాల్గొనే వారని రాజకీయ పరిశీలకులు అంచనా వేసేవారు. అయితే ఈ సారి పోలింగ్ శాతంను పెంచడానికి ఎలక్షన్ కమీషన్ ప్రత్యేక చర్యలు తీసుకొంది. నగరాలు, పట్టణాల్లో అయితే క్లాప్ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించి ప్రజలు, విద్యార్థులు, మహిళలకు ఓటు హక్కుపై చైతన్యం కల్పించింది. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లలో చైతన్యం తీసుకురావడానికి కళాజాత కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించారు. ఎలక్షన్ కమీషన్ ఓటర్లలో చైతన్యం తీసుకురావడానికి చేసిన ప్రయత్నాలు ఫలించి పోలింగ్ కేంద్రాలు భారీ సంఖ్యలో ఓటర్లు వచ్చి క్యూ లైన్లలో నిలుచుకొని పోలింగ్‌లో పాల్గొన్నారా! అంటే ఈ విషయంపై ఎవరికి సరైన స్పష్టత లేదు. వైకాపా నాయకులు మాత్రం తమ ప్రభుత్వం మహిళలు, వృద్ధులకు చేసిన మంచిని గుర్తించి వారే పోలింగ్ కేంద్రాలకు క్యూ లైన్లలో గంటల తరబడి నిలిచి తమకు అనుకూలంగా ఓటు వేశారని ప్రచారం చేస్తున్నారు. నగర, పట్టణ ప్రాంతాల్లో సైతం మహిళలు, వృద్ధులు తమ పార్టీ వెంటే వున్నాయని అధికార వైకాపా నాయకులు అంచనా వేసి ఈ ఎన్నికల్లో తమదే విజయం అని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇక ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ అయితే ప్రభుత్వంపై వున్న తీవ్ర వ్యతిరేకతను ప్రజలు తమ ఓటింగ్ రూపంలో బహిర్గతం చేశారని, ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికార వైకాపాను మట్టికరిపించి అధికారంను హస్తగతం చేసుకొంటుందని అంచనా వేస్తోంది. నగర, పట్టణ ప్రాంతాల్లోని ఓటర్లు ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో వుండి ప్రభుత్వంకు వ్యతిరేకంగా ఓటు వేశారని తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. గ్రామాల్లో సైతం మహిళలు, పురుషులు తమ పార్టీకి అనుకూలంగా ఓటు వేయడంతో ఈ సారి కచ్చితంగా రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. ఇప్పటికే తన తీర్పు వెల్లడించి ఓటరు మాత్రం తన పని తీను చేసుకొంటుంటే ఇరు పార్టీల నాయకులు మాత్రం రాష్ట్రంలో ఈ సారి అధికారం మాదంటే మాదే! అని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఓటరు ఇప్పటికే వెల్లడించిన తీర్పు బహిర్గతం కావాలంటే మే 4వ తేదీ వరకు అందరికి నిరీక్షన తప్పని పరిస్థితి. ఓటరు పోలింగ్ రోజు వెల్లడించిన తీర్పు ఈ పార్టీ వైపు మొగ్గు చూపుతుందనే విషయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## పలమనేరులో 87.90 శాతం ఓట్లు నమోదు

–రికార్డు స్థాయిలో నమోదైన ఓట్లు

**పలమనేరు,మే 14,ప్రభాతవార్త:**

పలమనేరు నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో ఓట్లు నమోదు కావడం జరిగింది.పలమనేరు నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 267896 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 132653 మంది,స్త్రీలు 135243 మంది ఓటర్లు ఉన్నారు.అందులో 235476 మంది ఓటర్లు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు.మధ్యాహ్నం 1 గంటకు పురుషులు 52597 మంది,స్త్రీలు 55097 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.మధ్యాహ్నం 1గంటకు 46.21శాతం ఓట్లు నమోదు కావడం జరిగింది. సాయంత్రం 3 గంటలకు పురుషులు 80122 మంది,స్త్రీలు 84366 మంది ఓటు హక్కును వినియోగించుకోవడంలో 61.40 శాతం ఓట్లు నమోదు కావడం జరిగింది.సాయంత్రం 5 గంటలకు పురుషులు 95988 మంది,స్త్రీలు 97781 మంది ఓటు హక్కును వినియోగించుకోవడంలో 72.33 శాతం ఓట్లు నమోదు కావడం జరిగింది.నియోజకవర్గంలో ఎన్నికల పోలింగ్ పూర్తి కావడంతో పురుషులు 117614 మంది,స్త్రీలు 117862 మంది మొత్తం 235476 మంది ఓటును వినియోగించుకున్నారు. పలమనేరులో గత 2019 ఎన్నికలలో 79శాతం ఓట్లు నమోదు కాగా ఈ ఎన్నికలలో రికార్డు స్థాయి 87.90 శాతం ఓట్లు నమోదు కావడం జరిగింది.

## వి.కోట ఎస్.బండపల్లెలో రాత్రి 2.30గంటల వరకు జరిగిన పోలింగ్

–పలు పోలింగ్ కేంద్రాలలో మురాయించిన ఈవిఎంలు

**పలమనేరు,వి.కోట,మే 13,ప్రభాతవార్త:**

వి.కోట మండలంలో సోమవారం రాత్రి 2.30 వరకు పోలింగ్ ప్రక్రియ జరిగింది.మండలంలోని ఎస్.బండపల్లెలో సాయంత్రం 6 గంటలకు సుమారు 600 మందికి ఎన్నికల సిబ్బంది టోకెన్లును పంపిణి చేశారు.అయితే ఆ పోలింగ్ కేంద్రంలో ఈవిఎంలు మురాయించడంతో రాత్రి 2.30గంటల వరకు పోలింగ్ ప్రక్రియ జరిగింది.రాత్రి కావస్తున్న ఓటర్లు ఓటు వేయడం కోసం వరుసలో వుండి వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు.మండలంలోని జోనిపల్లె,లింగాపురంలో ఈవియంలు మురాయించడం తో రాత్రి 12గంటల వరకు పోలింగ్ నిర్వహించారు.తోటకనుమలో రాత్రి 11 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు.పలు పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు అవగాహన లేకపోవడంతో ఈవిఎంలో వారి ఓటు వేయడంతో ఇబ్బందులు ఎదుర్కోవడంతో పోలింగ్ ఆలస్యంగా జరిగింది.పెద్దపంజాణి మండలంలో శివాడి,కమ్మపాళ్యం,కోగిలేరు గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలలో ఈవిఎంలు మురాయించడంతో రాత్రి 12 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ నిర్వహించారు.మంగళవారం ఉదయం 5గంటలకు పలమనేరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు.

## కుప్పంలో 89.88శాతం మేర పోలింగ్

చిత్తూరు జిల్లాలోనే అత్యధికం..

**కుప్పం, మే 14 ప్రభాతవార్త**

రాష్ట్రంలో రాజకీయ ప్రాధాన్యత సంతరించుకున్న కుప్పం నియోజకవర్గంలో ఈసారి ప్రజలు భారీ స్థాయిలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.కుప్పం అసెంబ్లీ (175) స్థానానికి, చిత్తూరు పార్లమెంట్ స్థానానికి సంబంధించి సోమవారం జరిగిన ఎన్నికల్లో చిత్తూరు జిల్లాలోనే అత్యధికంగా 89.88శాతం మేర ఓట్లు పోలైనట్లు కుప్పం రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు 'ప్రభాతవార్త'కు తెలిపారు. కుప్పం నియోజకవర్గంలో మొత్తం 2,25,775మంది ఓటర్లు ఉన్నారు. వీటిలో 2,02920 ఓట్లు పోలయ్యాయి. ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో పురుషులు 1,01306మంది, మహిళలు 1,01608మంది, ట్రాన్స్‌జెండర్స్ 6మంది ఉన్నారు. ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో 89.88శాతం మేర ఓట్లు పోల్ కాగా 2019 ఎన్నికల్లో 85.25శాతం మేర ఓట్లు పోలయ్యాయి. ఈ లెక్కన చూస్తే కుప్పంలో దాదాపు 5శాతం పోలింగ్ ఓట్లు పెరిగాయి. 2019 ఎన్నికల సందర్భంగా 2,13,146మంది ఓటర్లు ఉండేవారు. ఆ ఎన్నికల సమయంలో 1,81,712 పోలయ్యాయి. ఇక 2014 ఎన్నికల్లో 83.86శాతం మేర పోలింగ్ జరగగా అప్పట్లో 1,64,189 ఓట్లు పోలయ్యాయి.

## ఆనందరెడ్డి కుటుంబానికి నారా భువనేశ్వరి పరామర్శ

**రామకుప్పం, మే 14 ప్రభాతవార్త**

రామకుప్పం మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి కుటుంబానికి తాము అన్ని విధాలా అండగా ఉంటామని తెదేపా అధినేత చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి పేర్కొన్నారు. ఆనందరెడ్డి తండ్రి మునస్వామిరెడ్డి సోమవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. దీంతో మంగళవారం నారా భువనమ్మ ఫోన్ ద్వారా ఆనందరెడ్డి కుటుంబీకుల్ని పరామర్శించారు. మునస్వామిరెడ్డి మృతి పార్టీకి తీరని లోటు అని కొనియాడారు. తన త ండ్రి మృతి చెందినా సోమవారం ఎన్నికల సమయంలో గుండె నిబ్బరంతో ఆనందరెడ్డి పార్టీ కోసం పనిచేయడం పట్ల అభినందించారు.

## టిడిపి కార్యకర్తను పరామర్శించిన కొండేపాటి గంగా ప్రసాద్

**చిల్లకూరు, మే 14, ప్రభాతవార్త**



చిల్లకూరు పోలింగ్ స్టేషన్ వద్ద వైసిపికి తొత్తుగా వ్యవహరించి టిడిపి నేత కొడా రామచంద్రారెడ్డి పై ఎస్ఐ అంజిరెడ్డి చేసిన దాడిపై ప్రముఖ పారిశ్రామిక వేత్త కొండేపాటి గంగాప్రసాద్ బాధితుడిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయనతో పాటు బీదా రవిచంద్ర, తానంకి నానాజీ, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్ కుమార్, శిరసనంబేటి విజయభాస్కర్ రెడ్డిలు ఉన్నారు.

## ప్రతి ఒక్కరు టీకాలు వేసుకోవాలి

**సదుం, మే 14 ప్రభాతవార్త**



మండల పరిధిలోని 60 ఏళ్ల దాటిన ప్రతి ఒక్కరు టీకాలు వేసుకోవాలని ఆరోగ్య విస్తరణాధికారి ఉదయ్‌భాస్కర్ అన్నారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలోని ఆరోగ్య కార్యకర్తలు,సిబ్బంది నడిగడ్డ, వంతాండ్కుపారిఎల్లె, కురవవల్లె, వేణుగోపాలపురం, చిచ్చిలివారిపల్లె, కసిరెడ్డిగారిపల్లెలో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరికి చిన్న పిల్లలప్పుడు టీకాలు వేసి ఉంటారని అవి చాలా వరకు తుడిచిపెట్టుకు పోయాయని ఇప్పుడు మళ్లీ కొత్తగా వేస్తామని చెప్పారు. 60 ఏళ్ల దాటిన వారిలో గుండె ఆపరేషన్లు చేసుకున్న వారికి, మధుమేహవ్యాధిగ్రస్తులకు, గుండె సంబంధించిన ఇతర వ్యాధులు ఉన్నవారికి ఈ టీకాలు వేయడం లేదన్నారు. మిగిలిన వారంఆటీకాలు వేసుకుంటే ఆరోగ్యానికి మంచిదని చెప్పారు. అదేవిధంగా వేసవి కాలంలో ప్రతి ఒక్కరు ఓఆర్ఎస్ పాకెట్లు పెట్టుకుని తాగాలని సూచించారు. వీటి వల్ల డీహైడ్రేషన్‌కు గురైనా వెంటనే కోలుకుంటారని చెప్పారు. గ్రామాలలో ఓఆర్ఎస్ పాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయనతో పాటు సిహెచ్ఓ మోనీషా,సచివాలయం ఏఎన్ఎం సుజాత, ఏఎన్ఎం రుక్మిణి, ఆశావర్కర్లు శ్యామల,పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పులివర్తినానిపై దాడి హేయమైన చర్య

– చిత్తూరు పార్లమెంటు దేశం అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావు

**చిత్తూరు, మే 14 ప్రభాతవార్త:**

చంద్రగిరి అసెంబ్లీ తెలుగుదేశం అభ్యర్థి పులివర్తినానిపై వైకాపా నాయకులు మంగళవారం తిరుపతి పద్మావతి యూనివర్సిటీ పరిసరాల్లో దాడి చేయడం హేయమైన చర్య అని చిత్తూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావు ఓ ప్రకటనలో ఖండించారు. రాష్ట్రంను వైకాపా అరాచక శక్తుల నుండి రక్షించుకోవాలని నిర్ణయించిన ప్రజలు ఇప్పటికే ఓటుతో నిర్ణయించారని, ఓటమి భయంతో చంద్రగిరి వైకాపా అభ్యర్థి, ఆయన తండ్రి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారు.

## కడుపునొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్య

**బంగారుపాళ్యం, మే 14 ప్రభాతవార్త:**

కడుపునొప్పితో తీవ్రంగా బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకొన్న సంఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకొంది. కాటప్పగారిపల్లి గ్రామంకు చెందిన కృష్ణమూర్తి(43) తాపి పనులు చేసుకొంటూ జీవనం చేసేవాడు. ఇతనికి భార్య కుమారితో పాటు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె వున్నారు. కడుపునొప్పి తాళలేక ఇటీవల అపెండెక్స్ అపరేషన్ చేయించుకొన్నాడు. అయినా తరచు కడుపునొప్పి రావడంతో ఆ బాధను భరించలేక మంగళవారం ఉదయం ఒడిసాకు తిని ఆత్మహత్య చేసుకొన్నాడు. ఈ విషయంను గుర్తించిన కుటుంబసభ్యులు సత్వరం చికిత్స నిమిత్తం అతన్ని చీలాపల్లి సిఎంసి ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు ఎఎస్ఐ వళ్ళియమ్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పెళ్ళి కానందుకు వ్యక్తి ఆత్మహత్య

**బంగారుపాళ్యం, మే 14 ప్రభాతవార్త:**

తనకు వివాహం కాలేదని జీవితంపై విరక్తి చెంది సోమవారం సాయంత్రం ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకొన్న సంఘటన తుంబకుప్పంలో చోటు చేసుకొంది. గ్రామానికి చెందిన భరత్‌కుమార్(42) పెళ్ళి కాలేదని నెపంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లోనే ఫ్యానును ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ మల్లప్ప కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## యువకుడు ఆత్మహత్య

**గుడిపాల, మే 14 ప్రభాతవార్త:**



జీవితంపై విరక్తి చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకొన్న సంఘటన మండల పరిధిలో చోటు చేసుకొంది. ఎస్ఐ శ్రీనివాసరావు వెల్లడించిన వివరాల మేరకు కుప్పిగానిపల్లి హరిజనవాడకు చెందిన ఏసు కుమారుడు విజయ్(25) తల్లిదండ్రులు చెప్పిన మాట వినడం లేదని వారించారు. దీంతో మనస్థాపంకు గురైన విజయ్ మంగళవారం ఉదయం నుండి ఇంటి పరిసరాల్లో కన్పించకపోవడంతో తల్లిదండ్రులు బంధువులతో కలిసి వెతికారు. ఈ క్రమంలో చిత్తూరు–వేలూరు జాతీయ రహదారి నరహరిపేట డౌన్ వద్ద గత అటవీ ప్రాంతం సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకొని విజయ్ మృతి చెందినట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు సంఘటన స్థలం చేరుకొని మృతదేహంను కిందికి దింపారు. అనంతరం మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు గుడిపాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కుప్పంలో భరత్ గెలిస్తే

ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తా

– ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్

**కుప్పం,మే 14 ప్రభాతవార్త**



కుప్పంలో ఎమ్మెల్సీ భరత్ గెలిస్తే తాను తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానని అదే తెదేపా అధినేత చంద్రబాబునాయుడు గెలిస్తే భరత్ తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తారా అంటూ ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ సవాల్ విసిరారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుప్పం ప్రజలు చంద్రబాబును విశ్వసించారు కాబట్టే గతంలో లేని విధంగా రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైందన్నారు. వైకాపా అరాచకాలకు వ్యతిరేకంగా ప్రజలు తెదేపాకు ఓట్లేశారన్నారు. కుప్పంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ భరత్‌లు దోచుకున్నారని విమర్శించారు. తమ కల నెరవేరనుందని కుప్పంలో ఈసారి చంద్రబాబుకు లక్ష ఓట్ల మెజార్టీ రావడం తథ్యమన్నారు. జూన్ 4న సంచలన ఫలితాలు రాబోతున్నాయన్నారు. కుప్పంలో తమ కూటమికి మద్దతు పలికిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. తనతండ్రి మృతి చెందినా ఎన్నికల రోజు పార్టీ కోసం పనిచేసిన రామకుప్పం పార్టీ అధ్యక్షుడు ఆనందరెడ్డిని అభినందించారు. ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం మాట్లాడుతూ కుప్పంలో ఎన్నికలు యుద్ధ వాతావరణంలో జరిగాయన్నారు. వైకాపా శ్రేణులు దౌర్జన్యాలు చేశారన్నారు. ప్రజల్లో తిరుగుబాటు వచ్చి ఓట్లు వేశారన్నారు. విదేశాలనుంచి వచ్చి కుప్పంలో చంద్రబాబుకు ఓట్లేయడం హర్షణీయమన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, చంద్రబాబు కార్యదర్శి మనోహర్, నేతలు రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, డా॥ వెంకటేష్, సత్యేంద్రశేఖర్, కాణిపాకం వెంకటేష్, ఆర్ముగం, అన్సర్, నరేష్, తిరుమగళ్, సుధ పాల్గొన్నారు.

## రాధాకృష్ణచే మందహాసనము బహూకరణ

**చౌడేపల్లి, మే 14 ప్రభాతవార్త**



పట్టణంలోని అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయానికి దాత మందహాసనము విరాళంగా అందించారు. చౌడేపల్లి మాజీ సర్పంచు గాజుల పద్మావతమ్మ ఆధ్వర్యంలో రాధాకృష్ణ, శిరీష దంపతులు రూ. 1.50లక్షలు విలువ చేయు మందహాస మనము బహూకరించారు. మంగళవారం ఈమేరకు మంద్ర హాసనమునకు విశేష పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో పగలు వాహనాలను ఊరేగించేందుకు మందహాసనమును వినియోగిస్తున్నట్లు అర్చకులు తెలిపారు.

## వైభవంగా శ్రీశ్రీశ్రీ ఎల్లమ్మ తిరుణాల

**సదుం మే 14ప్రభాతవార్త**



తాటిగుంటపాలెం పంచాయతీ పాపిరెడ్డిగారిపల్లెలో 40 రోజుల క్రితం శ్రీశ్రీశ్రీ ఎల్లమ్మ దేవాలయ నిర్మాణం జరిగింది. ఆలయంలో కుంభాభిషేకం,అనంతరం అమ్మవారి విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. ఇది జరిగి 41 రోజులు పూర్తవడంతో గ్రామంలో మంగళవారం అమ్మవారి తిరుణాల,ఊరేగింపు నిర్వహించారు. ఉదయం అమ్మవారి ఆలయాన్ని వివిధ రకాల విద్యుద్దీపాలతోను, పలురకాల పుష్పాలతోను అలంకరించారు. అనంతరం అర్చకులు వివిధ రకాల హోమాలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకం జరిపించారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనాన్ని కల్పించారు. మహిళల చేత కుంకుమార్చన జరిపించారు.భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలోని అన్ని వీదులలో ఊరేగించారు. అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆమ్మవారి ఆలయ ధర్మకర్త దామోదర,వాసు, మధు,రెడ్డివారిపల్లె సర్పంచి హనుమంతురెడ్డి, ప్రసన్న కుమార్, పెద్ద ఎత్తున గ్రామస్థులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## మళ్లీ అధికారం మాదే

– వైసీపీ నేత దువ్వూరు వెంకటరమణారెడ్డి

**కోట, మే 14 ప్రభాతవార్త**



సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి అత్యధిక స్థానాలతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారం కైవసం చేసుకుంటుందని కోట మండలం పుచ్చలపల్లి జలసంఘం మాజీ అధ్యక్షులు దువ్వూరు వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన 99 శాతం వాగ్దానాలను జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని చెప్పారు. ఈ ఎన్నికల్లో చంద్రబాబునాయుడు ఎన్నో హామీలిచ్చినా ప్రజలు నమ్మలేదన్నారు. మహిళలు ముందుకు వచ్చి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ఓట్లు వేశారని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి అమలుపరిచిన సంక్షేమ పథకాలే మళ్లీ అధికారంలోకి తీసుకొస్తాయని చెప్పారు. ప్రజల గుండెల్లో జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని పేర్కొన్నారు. ఆయన వెంట సిద్ధవరం సొసైటీ అధ్యక్షులు పాదర్తి రాధాకృష్ణారెడ్డి ఉన్నారు.

## సిబిఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో లిటిల్ ఏంజల్స్ పబ్లిక్ స్కూల్ విజయకేతనం

**గూడూరు, మే 14, ప్రభాతవార్త**



పదవ తరగతి సిబిఎస్ఈ ఫలితాలలో లిటిల్ ఏంజల్స్ పబ్లిక్ స్కూలు మరోసారి విజయకేతనం ఎగురవేసింది. అందరు విద్యార్థులు 100 శాతం ప్రథమ శ్రేణిలో పాస్ కాగా ఎస్‌డి కహీషా తబస్సుమ్ 574 మార్కులు సాధించి స్కూలు టాపర్‌గా నిలిచింది. తరువాత స్థానాలలో 569 మార్కులతో ఎస్. జాహ్నవి, 568 మార్కులతో పి. హర్షిత్ సాయి, జశ్వంత్ కకుమార్ నిలిచారు. పరీక్షకు 77 మంది విద్యార్థులు హాజరుకాగా 31 మంది 500 పైగా మార్కులు సాధించడం విశేషం. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ బి. సుబ్రమణ్యం రెడ్డి మాట్లాడుతూ తాము 40 సంవత్సరాలుగా ఈ పాఠశాలను ఒక ఆదర్శవంతమైన పాఠశాలగా నడుతున్నామని క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందిస్తున్నామని దానికి నిదర్శనమే ఈ ఘన విజమని, ఈ విజయానికి కారణమైన విద్యార్థులు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తమ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు హెడ్ మాస్టర్ సురేష్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

**తడ, మే 14 ప్రభాతవార్త**



తడలోని కార్ స్టాండు వద్ద చెట్టుకు ఉరేసుకొని చనిపోయిన ఒక గుర్తుతెలియని వ్యక్తి శవాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున ఈ వ్యక్తి చనిపోయినట్లు భావిస్తున్నారు. ఇతని వివరాలు తెలిసిన వారు పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించాలని తడ ఎస్ఐ నరసింహారావు పేర్కొన్నారు.

## శభాష్.. బాగా పనిచేశారు

**సూళ్లూరుపేట, మే 14 ప్రభాతవార్త**



సూళ్లూరుపేట నియోజకవర్గంలో పార్టీ నేతలు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి విజయం కోసం కష్టపడి పనిచేశారు.. మీరందరూ శభాష్ బాగా పనిచేశారంటూ వారిని ప్రముఖ పారిశ్రామికవేత్త గంగాప్రసాద్ మెచ్చుకొని అభినందించారు. మంగళవారం పార్టీ నేతలు, కార్యకర్తలు వివిధ మండలాల నుంచి తరలివచ్చి ఆయనకు పోలింగ్ సరళి గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీరందరూ కష్టపడ్డారు.. మంచి ఫలితం వస్తుంది అంటూ చెప్పారు. అలాగే రాష్ట్రంలో చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో టిడిపి ప్రభుత్వం రాబోతోందని గంగాప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆకుతోట రమేష్, ఎజి కిషోర్, వివి సురేష్, అలీభాయ్, వెంకటేశ్వర్లు, దంతాల రవి తదితరులు పాల్గొన్నారు.

## క్షేమంగా చేరిన ఇరకం దీవి ఇవిఎంలు

**తడ, మే 14 ప్రభాతవార్త**

తడ మండలం ఇరకం దీవి నుంచి సార్వత్రిక ఎన్నికల తర్వాత ఇవిఎంలు క్షేమంగా చేరుకున్నాయి. పడవలపై అక్కడికి వెళ్లిన పోలింగ్ సిబ్బంది ఎన్నికల అనంతరం ఇవిఎంలను సూళ్లూరుపేటకు తరలించారు. అక్కడి నుంచి మిగిలిన ఇవిఎంలతో పాటు తిరుపతిలో ఉన్న స్ట్రాంగ్‌రూమ్‌కు వీటిని తీసుకెళ్లారు. అధికారులు ఈ సారి సమస్యాత్మక గ్రామమైన ఇరకం దీవిలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంతో పోలింగ్ శాతం పెరిగింది. 291 నంబరు పోలింగ్ స్టేషన్‌లో 88.33 శాతం ఓట్లు పోలవగా, 292 పోలింగ్ స్టేషన్‌లో 87.02 శాతం మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇరకం దీవి నుంచి ఇతర ప్రాంతాలకు వివిధ పనుల కోసం వెళ్లిన వారు సైతం తిరిగి వచ్చి ఓటింగ్‌లో పాల్గొన్నారు. తడ మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో కలిపి పోలింగ్ సుమారు 80 శాతం నమోదైంది. వీటిలో 90 శాతానికి మించి కారిజాత (262), వాటంబేడుకుప్పం (269), వాటంబేడు గ్రామం (271)తో పాటు కొండూరు (273), పూడి (293), వెంకటాద్రిపాలెం (303) పోలింగ్‌స్టేషన్లు ఉన్నాయి. అభ్యర్థుల భవితవ్యం ఇవిఎంలలో ఉండగా, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు లెక్కల కుస్తీలు పడుతున్నారు.

## సూళ్లూరుపేటలో 80 శాతం పోలింగ్

**సూళ్లూరుపేట, మే 14 ప్రభాతవార్త**

సూళ్లూరుపేట నియోజకవర్గంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 80.12 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలో రెండు లక్షలా 42వేల 610 ఓట్లు ఉండగా, అందులో ఒక లక్షా 94 వేల 378 ఓట్లు పోలయ్యాయి. పురుషులకు సంబంధించి ఒక లక్షా 18వేల 94 ఓట్లు ఉండగా, 95 వేల 790 ఓట్లు పోలయ్యాయి. 81.11 శాతం పోలింగ్ నమోదైంది. మహిళలకు సంబంధించి ఒక లక్షా 24 వేల 492ఓట్లుఉండగా 98 వేల 583 ఓట్లు పోయ్యాయి.79.19శాతం పోలింగ్ నమోదైంది. ట్రాన్స్ జెండర్లు 24మందిఉండగా,ఇందులోఐదుగురుతమఓటుహక్కు వినియోగించుకున్నారు. 20.83 శాతం నమోదైంది.

## విజయం కోసం పనిచేసిన అందరికీ ధన్యవాదాలు

**సూళ్లూరుపేట, మే 14 ప్రభాతవార్త**



తెలుగుదేశం పార్టీ శాసనసభ అభ్యర్థిగా పోటీచేసిన నెలవల విజయశ్రీ మంగళవారం పార్టీ నేతలకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం వివిధ మండలాలకు చెందిన కార్యకర్తలు, నేతలు ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ విజయం కోసం ప్రతి ఒక్కరూ శ్రమించారని, శ్రమకు తగ్గ ఫలితం తప్పకుండా వస్తుందని, పార్టీ కోసం శ్రమించిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని ఆమె భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో ప్రజలందరూ ప్రభంజనంలా ఉద్యమించి చంద్రబాబుకు పట్టం కట్టాలని కసిగా ఓట్లు వేశారని నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం, సీనియర్ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, వివి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**వెంకటగిరి టౌన్, మే 14, ప్రభాతవార్త**



క్రాస్ రోడ్డు ప్రాంతంలో ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పలు దళిత సంఘాల వారు క్రాస్ రోడ్ వద్ద రాస్తారోకో నిర్వ హించి ఆందోళన చేశారు. అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేసిన వారిని ఇంత వరకు గుర్తించక పోవడం దారుణం అన్నారు. అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేసిన వారిని సిసి కెమెరా ద్వారా గుర్తించి అరెస్టు చేస్తామని ఎస్ఐ నాయక్ నాయకులు చేసిన వారికి తెలిపారు. ఎస్ఐ ఆమెతో ఆందోళనకారులు ఆందోళన విరమిచ్చారు.నాయకులు మునయ్య, ధనంజయ, జాన్, రవి తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం కార్యకర్తపై రౌడీ మూకలు దాడి

**చిల్లకూరు, మే 14, ప్రభాతవార్త**



చిల్లకూరు మండప పరిధిలోని చింతవరం, కొత్తపాలెం గ్రామానికి చెందిన జాలారి గోపాల్ అనే తెలుగుదేశం పార్టీ కార్యకర్తపై ముగ్గురు రౌడీ మూకలు తీవ్రంగా గాయపరిచారు. బాధితుని వివరాల మేరకు సోమవారం జరిగిన అసెంబ్లీ పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా పోలింగ్ బూత్ వద్ద ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యకర్త అయినటువంటి గోపాల అనే వ్యక్తి ఎన్నికల్లో వైసిపి పార్టీకి ఓటు వేయలేదని కక్ష పెంచుకున్న కొంతమంది నాయకులు మంగళవారం చింతవరం గ్రామంలో పురుగు మందుల అంగడిలో ఉన్న గోపాలని ముగ్గురు రౌడీ మూకలు దాడి చేసి తలకు తీవ్రంగా గాయపరిచారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే గాయపడిన వారిని చికిత్స నిమిత్తం నెల్లూరు అపోలో హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. మెరుగైన వైద్యం కోసం చెన్నైకి తరలించేందుకు ఏర్పాటు చేయడం జరిగింది. పోలీసులు విచారణ జరిపి బాధితులపై కేసు నమోదు చేయాలని కుటుంబ సభ్యులు తెలియజేసారు.

## నా కార్యకర్తలు జోలికొస్తే ఊరుకునేది లేదు

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్

**గూడూరు, మే 14, ప్రభాతవార్త**



వైసిపి నాయకులు, కార్యకర్తలు జోలికొస్తే ఊరుకునేది లేదని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ పేర్కొన్నారు. సోమవారం గూడూరు పట్టణంలోని సనత్ నగర్‌లోని వైసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిల్లకూరులో ఎలక్షన్ రోజు జరిగిన ఘటన ఎంతో కలచివేసిందన్నారు. టిడిపి వాళ్లు విధ్వంసం సృష్టించి మా నాయకులపై కార్యకర్తలపై అసత్య ప్రచారాలు చేయడం సబబు కాదన్నారు. గూడూరు నియోజకవర్గ చరిత్రలో ఇటువంటి ఘటన ఎప్పుడు జరగలేదన్నారు. ఇలా చేయడం వలన గూడూరుకి మచ్చ ఏర్పడిందన్నారు. ప్రశాంత వాతావరణంలో జరుగుతున్న ఎలక్షన్‌ను టిడిపి అల్లరి మూకలు రాధాంతాలు చేసి ఓటర్లు భయభ్రాంతులకు గురిచేసారన్నారు. ఇకనైనా ఇటువంటి చర్యలు మానుకోవాలని సూచించారు. వైసిపి కార్యకర్తలు, నాయకులు నా కుటుంబ సభ్యులు అని వాళ్ల జోలికొస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. కచ్చితంగా ప్రభుత్వాని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు మల్లు విజయకుమార్ రెడ్డి, వాయుగండ్ల నాగరాజు, తాళ్లూరు శ్రీనివాసులు, మరి కొంత మంది నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీదే అధికారం, చంద్రబాబు నాయుడు సిఎం

అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ

**వెంకటగిరి టౌన్, మే 14, ప్రభాతవార్త**

సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధిస్తుందని చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తాడని టిడిపి అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరిలోని ఆయన నివాస గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను 25 వేల నుండి 30 వేల మెజార్టీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఐదు సంవత్సరాల వైసిపి అరాచక పాలనకు ప్రజలు తట్టుకోలేక కసిగా తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేశారని తెలిపారు. అంబేద్కర్ విగ్రహాన్ని అకతాయిలు ధ్వంసం చేసిన వారిని గుర్తించి అరెస్టు చేయాలని సిఐకి ఫోన్ చేసి చెప్పానని తెలిపారు. అంబేద్కర్ విగ్రహం నిర్మించేందుకు తాను సహకరిస్తానని చెప్పారు. మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ బీరం రాజేశ్వర రావు, నాయకులు శ్రీనివాసులు, నాగరాజా, గురుప్రసాద్, తదితరులు ఉన్నారు.

## పోలింగ్ సరళిపై రాజకీయ పార్టీల అంచనాలు

**కోట, మే 14 ప్రభాతవార్త**

సార్వత్రిక ఎన్నికల పోరు ముగిసింది. ఓటరు తీర్పు ఇవిఎంలలో నిక్షిప్తమైంది. రాజకీయ పార్టీల నేతలు అంచనాలపై కుస్తీ పడుతున్నారు. ముఖ్యమైన నేతలతో నియోజకవర్గ బాధ్యులు మాట్లాడి పోలింగ్ సరళిపై ఆరా తీస్తున్నారు. తమ పార్టీకి ఎక్కడెక్కడ ఎన్ని ఓట్లు వస్తున్నాయని అంచనాలు వేస్తున్నారు. ప్రతికూల పరిస్థితులు ఉంటే అందుకు గల కారణాలను విశ్లేషిస్తున్నారు. గూడూరు నియోజకవర్గం మొత్తంగా తమ పార్టీకి వచ్చే మెజారిటీపై అటు వైసీపీ, ఇటు టిడిపి నాయకులు లెక్కలేసుకుంటున్నారు. కోట మండలంలో వైసీపీ నాయకులు కొడవలూరు ధనంజయరెడ్డి, పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, యరటపల్లి మధుసూదన్‌రెడ్డి, దువ్వూరు వెంకటరమణారెడ్డి, నియోజకవర్గంలో జరిగిన ఓటింగ్‌పై ఆరా తీస్తున్నారు. ఇటు తెలుగుదేశం పార్టీలో చిల్లకూరు దశరధరామిరెడ్డి, షేక్ జలీల్ అహ్మద్, ఉచ్చూరు రవీంద్రారెడ్డి, తీగల సురేష్‌బాబు తదితరులు పార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయని లెక్కలు కట్టి విజయంపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## బిజెపి మండల అధ్యక్షుడిపై దాడి

శ్రీకాళహస్తి, మే 14 ప్రభాతవార్త




సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ నేపథ్యంలో శ్రీకాళహస్తి మండలంలోని అక్కుర్తి పోలింగ్‌బూత్ నంబర్ 28లో రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు కూనాటి నాగరాజుపై వైసిపి గూండాలు చేసిన దాడిని బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా.ఆనంద్ కుమార్, పార్లమెంటు ఎంపి అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అక్కుర్తిలోని కూనాటి నాగరాజు ఇంటికి వెళ్ళి ఆయన్ను పరామర్శించారు. వైసిపి గూండాల గాడిని తీవ్రంగా ఖండించారు. నాగరాజును పరామర్శించి నాగరాజు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. ఇరువురు నేతలు వారి కుటుంబసభ్యులకు భరోసా కల్పించారు. నాగారాజు మీద దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని పోలీసు అధికారులను డిమాండ్ చేశారు. రూరల్ సిఐ అజయ్‌కుమార్‌ను వెంటనే విధుల నుంచి తొలగించాలని ప్రజాస్వామ్యంలో ప్రశాంతంగా ఎన్నికలు జరగాల్సి ఉండగా స్థానికేతరులు ప్రోత్సహించి దాడులు చేయడం సబబు కాదన్నారు. అనంతరం అక్కుర్తి గ్రామంలో బాధితుడు సిద్దాగుంట సుబ్బరామిరెడ్డి కుటుంబంను పరామర్శించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కో కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యంరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్‌వి.రమణ, వేలవేడు ధర్మయ్య, మండల అధ్యక్షులు తేజోవతి, వేడాం కృష్ణయ్య, మండల ప్రధాన కార్యదర్శులు నాగరాజు, సత్యనారాయణ, వెంకటసుబ్బయ్య, జివిఅమర్నాధ్, శివారెడ్డి, బిందు కుమార్, రవిచంద్ర, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## చిల్లకూరులో జరిగిన ఘటన బాధాకరం

ఎస్ఐ అంజిరెడ్డిపై చర్యలు తీసుకోవాలి : పాశం సునీల్ కుమార్



గూడూరు, మే 14, ప్రభాతవార్త

కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని గూడూరు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్ కుమార్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిల్లకూరులో ఎలక్షన్‌లో జరిగిన ఘటన కలిచి వేసిందన్నారు. ఎస్ఐ అంజిరెడ్డి చేత మా నాయకులు పై దాడి చేయడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. మా నాయకులు వేటాడేస్తావా, అని బెదిరించడం ఎంత వరకు సమంజసం, ఇలాంటివన్నీ దాటుకుని ఈ స్థాయికి వచ్చానన్నారు. వైసిపి అల్లరి మూకలు ఇటువంటి చర్యలు మానుకోవాలని హితవు పలికారు. గూడూరు నియోజకవర్గంలో ఎప్పుడూ లేని సంస్కృతిని వైసిపి నాయకులు తీసుకురావడం బాధాకరమన్నారు. ఎలక్షన్ కమిషన్ ఎస్ఐ అంజిరెడ్డి పై చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా చిల్లకూరు మండలంలోని చింతవరం, కొత్తపాలెం గ్రామానికి చెందిన జాలారి గోపాల్‌పై వైసిపి నాయకులు మంగళవారం ఉదయం అంగట్లోకి ప్రవేశించి దారుణంగా దాడి చేయడం బాధాకరం . అతను నెల్లూరు అపోలో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమంగా ఉంది అని వారు తెలిపారు. అదే విధంగా చిల్లకూరు మండల అధ్యక్షులు పుచ్చూరు వెంకటేశ్వర్ రెడ్డి రొయ్యల చెరువులో గుర్తు తెలియని వ్యక్తులు విషపురుగు మందులు కలిపి రొయ్యలను చంపడం బాధాకరమన్నారు. జూన్ 4న కచ్చితంగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని గూడూరులో తన విజయం తధ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్‌లో వైసిపి ఆటలు సాగలేదు

ఆరణి శ్రీనివాసులు

తిరుపతి కార్పొరేషన్, మే 14, ప్రభాతవార్త

తిరుపతి నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా జరగడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ తెలుగుదేశం, బిజెపి బలపరిచిన జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ దొంగ ఓట్లకు ప్రయత్నించిందని ఎన్డీఏ నేతలు దొంగ ఓటర్లను పోలీసులకు పట్టించారని ఆయన తెలిపారు. మరోవైపు కేంద్ర భద్రతా దళాలు దొంగ ఓటర్ల పట్ల కఠినంగా వ్యవహరించాయని ఆయన నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. తెలుగుదేశం పోలింగ్‌కు అన్ని విధాలా సహకరించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తిరుపతి పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు నరసింహయాదవ్, మబ్బు దేవనారాయణ రెడ్డి, పులుగోరు మురళీ, కోడూరు బాలసుబ్రమణ్యం, ఊక విజయ్ కుమార్, ఆర్సీ మునికృష్ణ, చినబాబు, బుల్లెట్ రమణ, బిజి కృష్ణయాదవ్, పుష్పవతి బిజెపి నేతలు భానుప్రకాష్ రెడ్డి, సామంచి శ్రీనివాస్, పొనగంటి భాస్కర్, వరప్రసాద్ జనసేన నాయకులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, జనసేన పరిశీలకులు లక్ష్మీపతి, సుభాషిణి, కీర్తన, కిరణ్ రాయల్, రాజారెడ్డి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## బుధవారం గంగమ్మకు సారి సమర్పణ

తిరుపతి హెల్త్, మే 14, ప్రభాతవార్త



ఏకవీర సేవ ఫౌండేషన్ వ్యవస్థాకులు, సమాజ సేవకులు ప్రతాప్ స్వామీజీ ఆధ్వర్యంలో స్థానిక రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి సారథ్యంలో తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ తల్లికి బుధవారం ఉదయం 10 గంటలకు సారె సమర్పించనున్నారు. స్థానిక పెద్ద గంగమ్మ ఆలయం నుంచి వివిధ రకాల వేషాలలు ధరించిన కళాకారులు, డబ్బులు, కోలాటాలు, చెక్క భజనలు నృత్యాల నడుమ గంగమ్మ ఆలయం వరకు విచ్చేసి అమ్మవారికి సారెను సమర్పించి అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

## వేసవిలో తగిన జాగ్రత్తలు తీసుకోండి

-డాక్టర్ సివిల్ అసిస్టెంట్ సర్జన్ సతీష్

శ్రీకాళహస్తి, మే 14 ప్రభాతవార్త



వేసవిలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే ప్రజలు వడదెబ్బ సోకుకుండా ఉంటుందని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యులు సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ సతీష్ తెలిపారు. ఆయన 'ప్రభాతవార్త'తో ప్రస్తుతం వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వడదెబ్బకు గురైన వారికి అందించే చికిత్స విధానాలను వివరించారు. ఈనేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలను వివరించారు. ఎంత తీవ్రత వలన శరీర ఉష్ణోగ్రత కూడా పెరిగి(104.9ఎఫ్) మెదడులోని ఉష్ణోగ్రత నియంత్రించే కేంద్రం (హైపోథలామస్) దెబ్బతిని వడదెబ్బకు గురిఅవుతారని దీనినే హీట్ స్ట్రోక్ లేదా సన్‌స్ట్రోక్ అంటారు. ఇది ప్రమాదకరం మరియు ప్రాణాంతకం అని తెలిపారు.

### వడదెబ్బ తగలడానికి ముఖ్యకారణాలు:-

1. శరీరంలో ఎక్కువ వేడి ఉత్పత్తి కావడం.
2. శరీరం ఉష్ణాన్ని కోల్పోవడం

వడదెబ్బ వలన శరీరంలోకలిగే మార్పులు:-

వాతావరణపు వేడిమికి శరీరం ఎక్కువసేపు గురికావడం వలన చెమటపట్టి శరీంలోని లవణాలు (సోడియం క్లోరైడ్) తగ్గిపోవడం, లేక శరీరంలో నీటి నిష్పత్తి తగ్గిపోవడం సంభవిస్తుందన్నారు. అధిక ఉష్ణోగ్రత ఉన్న ప్రదేశాలలో ఎక్కువ శ్రమతో కూడిన పని చేస్తున్నపుడు ప్రతి గంటకు మూడు లేక నాలుగు లీటర్ల నీటిని చెమటరూపంలో మన శరీరం కోల్పోతుంది.

**వడదెబ్బకు ఎక్కువగా గురయ్యేవారు:--**

65ఏళ్ళ వయస్సు పైబడిన వారు
- గర్భిణీలు మరియు పాలిచ్చే తల్లులు- పసిపిల్లలు
- అనారోగ్యంతో బాధపడుతున్న వారు (గుండెజబ్బు, అధిక రక్తపోటు) వడదెబ్బ లక్షణాలు:-
- విపరీతమైన తలనొప్పి, తలతిరగడం - తీవ్రంగా జ్వరం కలిగి ఉండడం
- మగత నిద్ర లేదా కలవరింతలు- ఫిట్స్ లేదా పాక్షికంగా అపస్మారక స్థితిలోకి వెళ్లడం వంటివి ఉంటాయన్నారు. వెంటనే వైద్యున్ని సంప్రదించాలని కోరారు.
- ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉన్నాయని వృద్దులు, పిల్లలు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు బయటకు రాకూడదన్నారు.

## అగ్ర శ్రీ ఆధ్వర్యంలో రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి నీలం సంజీవ రెడ్డి 111వ జయంతి

తిరుపతి క్రీడ, మే 14, ప్రభాతవార్త

భారత గ్రామీణ అధ్యయనం, పరిశోధన అకాడమీ ఆధ్వర్యంలో మే 19న భారత 6వ రాష్ట్రపతి, యునైటెడ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి నీలం సంజీవ రెడ్డి 111వ జయంతి వేడుకల సందర్భంగా తిరుపతిలోని డిఆర్‌డిఏ సమావేశ మందిరంలో మానవ హక్కులు, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 అనే అంశంపై 2వ నీలం సంజీవరెడ్డి రాష్ట్ర అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అగ్ర శ్రీ వ్యవస్థాపక సంచాలకుడు డాక్టర్ డి. సుందరరామ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి, పంచాయితీ రాజ్ సంస్థ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలకు చెందిన 5 మంది ప్రముఖులకు పురస్కారాలను బహుకరిస్తున్నట్లు జ్యూరీ కన్వీనర్ డాక్టర్ సుందరరామ్ పేర్కొన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని నీలం సంజీవ రెడ్డి రాష్ట్ర అవార్డుల గ్రహీతల గౌరవార్థం అగ్ర శ్రీ ప్రత్యేక సావనీర్‌ను విడుదల చేస్తున్నామని, ఈ కార్యక్రమానికి ఏపీ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ మాజీ చైర్మన్ డాక్టర్ జస్టిస్ జి. యెతిరాజులు అధ్యక్షత వహిస్తారని డాక్టర్ సుందర్ రామ్ వివరించారు.

## రాష్ట్ర తెలుగుదేశంపార్టీ అధికార ప్రతినిధిగా గురవారెడ్డి

శ్రీకాళహస్తి, మే 14 ప్రభాతవార్త



తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షులు నారాచంద్రబాబునాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెమనాయుడులు రాష్ట్ర తెలుగుదేశంపార్టీ అధికార ప్రతినిధిగా ప్రకటించారు. గత 32సంవత్సరాలుగా పార్టీలో పనిచేస్తూ మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో వివిధ హోదాలో అనుబంధ విభాగాల్లో పనిచేసి నిరంతరం పార్టీకోసం పనిచేస్తూ పార్టీ ఇచ్చిన కార్యక్రమాలను ప్రతిపక్షంలోను పార్టీ నిర్దేశించిన కార్యక్రమాలను ముందుకు తీసుకుపోతూ పార్టీ అభివృద్ధికి కృషిచేస్తూపార్టీ అధికార ప్రతినిధిగా అవకాశం కల్పించిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర పార్టీ అధ్యక్షులు అచ్చెమనాయుడు, హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ, యువగళం నేత నారాలోకేష్, జాతీయ ప్రధాన కార్యదర్శి బీదరవిచంద్ర, జోన్ పరిశీలకులు రాంగోపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## వెలగని వీధి లైట్లు:ముక్కుపిండి పన్ను వసూళ్ళు

శ్రీకాళహస్తి,మే 14 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మున్సిపాలిటి పని తీరు రోజు రోజుకు తీసి కట్టుగా మారుతుంది.ప్రజల నుంచి ముక్కుపిండి పన్నులు వసూళ్ల చేస్తున్నారు.అడ్వాన్సు టాక్సులను వసూలు చేయటమే కాకుండా ఏడాదికి రూ.6కోట్ల డిమాండ్‌తో 95శాతం వసూలు చేస్తున్నారు.ఇక అడ్వాన్సు టాక్సు చెల్లిస్తే 5శాతం రిబేటు అంటూ సుమారు ఒక నెలలో రూ.1.6కోట్లు వసూలు చేసారు. అయితే వీధుల్లో వీధి దీపాలు వెలగటం లేదు. వార్డుల్లో రోడ్ల పరిస్థితి దయనీయంగా మారింది. కానీ పట్టించుకునే దిక్కులేదు.శ్రీకాళహస్తి దేవస్థానం కొత్తగా ఏర్పాటు చేసిన ఆధునీక విద్యుత్ లైట్లు ౽కూడా నాసిరకం అనటానికి తేరువీధిలో అప్పుడే ఒక లైట్ ఆరింది.మున్సిపాలిటి వసూలు చేసే పన్నులతో ఎన్నో పనులు చేసే అవకాశం ఉంది.కానీ ఎందుకో అభివృద్ధి కుంటుపడింది.ఇటీవల ముత్యాలమ్మగుడివీధిలో గతుకులకు అతుకులు వేసారు. ఎవరు వేసారంటే మున్సిపాలిటి వేయలేదని సంబంధిత ఇంజనీర్ వివరించారు. ఇదే పరిస్థితి అన్ని వార్డుల్లో చోటు చేసుకుంది. అధికారులు కార్యాలయం వదలి రావటం లేదు. ప్రజా సమస్యలను గురించి పట్టించుకోవటం లేదు. అధికార పార్టీ నాయకుల ఆదేశాలతో అధికార పార్టీ అనుయాయుల జేబులు నింపుటకు మాత్రమే పనులు అప్పగిస్తున్నారు. నిబంధనలు కేవలం కొందరికే అన్నట్లు మారింది.ఇప్పటికైనా అధికారులు ప్రజలు ఎదుర్కొంటున్న చిన్న చిన్న సమస్యలపై స్పందించాల్సి ఉంది. ఆరునెలలుగా కొందరు విద్యుత్ లైట్లు అభ్యర్థిస్తుంటే కమిషనర్ అరచేతిలో స్వర్గం చూపటం మినహా సమస్య పరిష్కరించటం లేదు. వార్డుల్లో వీధి లైట్లు వెలగటం లేదు.

## గంగమ్మ తల్లి నామావళి సీడీ ఆవిష్కరించిన కరుణాకర్ రెడ్డి

తిరుపతి హెల్త్, మే 14, ప్రభాతవార్త



తిరుపతి శ్రీ తాత య్య గుంట గంగ మ్మ నామావళి సిడీని టిటిడి చైర్మన్, తిరు పతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి మంగళ వారం సాయంత్రం పద్మా వతి పురంలోని తన నివాసం వద్ద ఆవిష్కరించారు. స్థానిక వర్ణమ్యూజిక్ అకాడమీ సమర్పణలో డాక్టర్ విజయలక్ష్మి రచించి, కోనేరు లక్ష్మీ రాజ్యంతో కలిసి గానం చేయగా, ఆర్ కళ్యాణ్ కుమార్ సంగీతం సమకూర్చరు. తిరుపతి శ్రీ తాతయ్య గుంట గంగమ్మ తల్లి జాతర మంగళవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో సీడీని రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, దేవదానం, తొండమల్లు పుల్లయ్య పాల్గొన్నారు.

## పోటీ పరీక్షల శిక్షణకు జాతీయ స్థాయిలో అగ్రగామి విశ్వం

### ఏపిఆర్‌జేసి - 2024 ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులతో విశ్వం సంచలన విజయం , రాష్ట్ర స్థాయిలో 10 లోపు 9 ర్యాంకులు సాధించిన ఏకైక విద్యా సంస్థ విశ్వం

తిరుపతి క్రీడ, మే 14, ప్రభాతవార్త




రాష్ట్ర స్థాయిలో 2024 విద్యా సంవత్సరంలో ఏపిఆర్‌జేసి ప్రవేశానికి ఏప్రిల్ 25వ తేదిన నిర్వహించిన ఎంట్రెన్స్ టెస్ట్ ఫలితాల్లో తిరుపతి విశ్వం విద్యా సంస్థలో శిక్షణ పొందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులతో పాటు వివిధ విభాగాల్లో 10 లోపు 9 ర్యాంకులు సొంతం చేసుకుని విశ్వం విద్యా సంస్థలకు తిరుగులేదని నిరూపించారు. పి. హేమశ్రీ, కే. నిత్యశ్రీ కల్యాణి, రాష్ట్ర స్థాయి ప్రథమ ర్యాంకులు సాధించారు. ఓ. దీరజ్ రాష్ట్ర స్థాయి ద్వితీయ ర్యాంకులు, పి. మేఘన, ఆర్. మహిత రాష్ట్ర స్థాయి తృతీయ ర్యాంకులు సాధించారు. కె. చరిత రాష్ట్ర స్థాయి 4వ ర్యాంకు, ఆర్ రెడ్డి చరణ్ రెడ్డి, రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంకు, సి లేఖ రాష్ట్ర స్థాయిలో 6వ ర్యాంకు, డి. నవదీప్ నాయక్ రాష్ట్ర స్థాయిలో 7వ ర్యాంకులు సాధించి ప్రభంజనం సృష్టించారు. ఈ కార్యక్రమంలో విశ్వం విద్యా సంస్థల అధినేత డా. ఎన్. విశ్వనాథ్ రెడ్డి మాట్లాడుతూ పోటీ పరీక్ష ఏదైనా విశ్వం విద్యార్థులకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించడం ఆనవాయితీగా మారిందని తెలిపారు. గత 34 సంవత్సరాలుగా సంచలన ఫలితాలు సాధించి రికార్డులు తిరిగి రాయడం తమ విద్యార్థుల ఫలితాలతో సాధ్యమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తూ విద్యే ప్రథమ ధ్యేయంగా బోధిస్తున్నటువంటి అధ్యాపక బృందానికి విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులకు సంస్థ అధినేత కృతజ్ఞతలు తెలియజేసారు. స్ఫూర్తిదాయకమైన విద్యను అందిస్తూ విజయ సాధనకు తోడ్పడటం విశ్వం విద్యా సంస్థలకు సాధ్యం అనని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో విశ్వం విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ ఎన్. విశ్వచందన్ రెడ్డి, కరస్పాండెంట్ తులసి విశ్వనాథరెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొని విద్యార్థుల్ని అభినందించారు.

# తిరుపతి డివిజన్

## శ్రీకాళహస్తిలో 83.25శాతం పోలింగ్: సత్యవేడు అత్యధికం 85.28శాతం

శ్రీకాళహస్తి,మే 14 ప్రభాతవార్త



సుమారు 50 రోజుల రాజకీయ ఉత్కంఠతకు తెర సోమవారం పోలింగ్‌తో తెరపడింది. ఎన్నికల సంఘం ప్రకటించిన సమాచారం మేరకు తిరుపతి జిల్లాలోని సత్యవేడు నియోజకవర్గంలో అత్యధికంగా ఓటింగ్ జరిగినట్లు తెలిపారు. ఇక్కడ 2,15,385 మంది ఓటర్లు కగా వీరిలో పురుషులు 1,04,377,మహిళలు 1,10,997 కాగా సోమవారం పోలింగ్‌లో పురుషులు 89,844 మంంది,మహిళలు 93,839మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.అంటే 85.28 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు అధికారులు ప్రకటించారు. ఇక శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,48,536 మంది కాగా ఇందులో మహిళలు 1,95,930 పురుషులు 1,00,982 మంది ఉన్నారు. కాగా ఓటు హక్కును పురుషులు 1,00,982 మంది మహిళలు 1,05,930మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు సమాచారం అంటే 83.25 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ప్రకటించారు.అంటే రెండు నియోజకవర్గాల్లో మహిళలే అత్యధికంగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నట్లు తెలుస్తుంది. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పురుషుల కంటే మహిళలు 5వవేల మంది అధికంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే సత్యవేడు నియోజకవర్గంలో కూడా మహిళలు నాలుగువేల మంది అధికంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు.

### మహిళల ఓట్లే కీలకం:

ఏ ఎన్నికల్లో అయినా మహిళా ఓటర్లే కీలకం.వారు ఎటు మొగ్గ చూపితే ఆ పక్షం విజయం సాధించినట్లే. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికల్లో రెండు నియోజకవర్గాల్లోనూ మహిళలు పురుషుల కంటే అధికంగా ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఉదయం ఏడు గంటల నుంచి పోలింగ్ అంటే మహిళలు ఉదయం 6 గంటల నుంచే పోలింగ్ బూత్‌ల వద్ద బారులు తీరారు. అయితే ఓటింగ్ గుంభనంగా సాగింది. ఓటర్లలో స్థబ్దత చోటు చేసుకుంది.'ఓటరు మౌనం అధికార పక్ష పథకాలకు అంగీకారమా? లేక తిరస్కారమా?' అనేది చర్చనీయాంశంగా మారింది. పట్టణంలో అధికార పార్టీ ఓటర్లకు ఓటుకు రూ.3వేలతో పాటు పలు తాయిలాలు అందించారు.ఇది తమకు అనుకూలమని భావిస్తున్నారు.మహిళలు పోలో మని ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై ఓటర్ల సునామి కురిపించారని భావిస్తున్నారు.కానీ ప్రతిపక్షం మాత్రం ఐదేళ్ళ పాలనలో అనుభవించిన ఒక్క చాన్సు శిక్షతో తిరుగుబాటు వచ్చిందని 'జనం మార్పుకోరుకున్నారు' కాబట్టి గంటల తరబడి క్యూలైన్లలో ఎండను సైతం లెక్క చేయక ఓటు చేసారని భావిస్తున్నారు.మరి ఈ ఉత్కంటతను అధిగమించాలంటే మరో 20రోజులు ఓపిక పట్టక తప్పదు.

## స్విమ్స్ పరిశోధన విద్యార్థినికి డాక్టరేట్ ప్రదానం

తిరుపతి హెల్త్, మే 14, ప్రభాతవార్త



శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ యూనివర్సిటీలో కార్డియో వ్యాస్కులర్ అండ్ థొరాసిక్ సర్జరీ విభాగంలో పరిశోధనలు నిర్వహించిన విద్యార్థిని ఎన్. కవితకి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పట్టాను ప్రధానం చేసినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్ తెలిపారు. స్విమ్స్ పరిశోధక విద్యార్థిని ఎన్. కవిత అలైడ్ హెల్త్ సైన్సెస్ విభాగం కింద కార్డియో వ్యాస్కులర్ అండ్ థొరాసిక్ సర్జరీ విభాగంలో పోస్ట్ - ఆపరేటివ్ అనిమియాతో శస్త్ర చికిత్స అనంతరం సింగిల్ వాల్వ్ రీప్లేస్మెంట్ వ్యక్తులలో క్రియాత్మక వ్యాయామ సామర్థ్యంపై పర్యవేక్షించబడే వ్యాయామాల ప్రభావాలు అనే అంశంపై పరిశోధనను నిర్వహించారు. స్విమ్స్ కార్డియాలజి విభాగం సినియర్ ప్రొఫెసర్, చీఫ్ గైడ్ డా. వి. వనజాక్షమ్మ పర్యవేక్షణలో కవిత సమర్పించిన ఈ గ్రంథాన్ని యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ వారు పరిశీలించి పిహెచ్‌డి డిగ్రీ ప్రధానం చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డా. వనజాకమ్మ అధికారంగా ప్రకటించారు.

## జగన్నాథపురంలో సర్పంచ్ ఇంటిపై వైసీపీ మూకలు దాడి

విజయపురం, మే 14 ప్రభాతవార్త:



మండలంలోని జగన్నాథపురంలో సర్పంచ్ రాణెమ్మ నారాయణరాజు ఇంటిపై వైసీపీ మూకలు దాడి చేసిన సంఘటన సోమవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు... సోమవారం పోలింగ్ అనంతరంసాయంత్రం 7 గంటల సమయంలో వైసీపీ టీడీపీ వర్గీయుల మధ్య తేలికపాటి ఘర్షణ జరిగింది. పోలీసులకు సమాచారం అందడంతో ఇరువర్గాలు పరారయ్యారు. అనంతరం అర్ధరాత్రి వైసీపీ వర్గీయులు గుంపుగా దుండగులను పోగు చేసుకుని సర్పంచ్ ఇంటిపై రాళ్ళతో, పెద్ద కర్రలతో దాడి చేయడంతో కిటికీ అద్దాలు, కారు బ్యాక్‌లైట్ ధ్వంసమయ్యాయి. వెలుపలు నిద్రిస్తున్న సర్పంచ్ కుమారుడు జగదీష్‌కు గాయాలు కావడంతో తిరుపతిలో చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న వెంటనే డీఎస్పీ నరసింహమూర్తి, సీఐ సుబ్బరామిరెడ్డి, ఎస్ఐ జయప్ప సంఘటనా స్థలానికి చేరుకుని సర్పంచ్ దంపతలను విచారించారు. విధ్వంసానికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేశామని, త్వరలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తామన్నారు.

### గాలి భానుప్రకాష్ పరామర్శ

సర్పంచ్ కుటుంబాన్ని నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ పరామర్శించారు. అర్ధరాత్రిలో టీడీపీ కార్యకర్తలపై దాడి చేయడం సరికాదన్నారు. ఇంటిపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చినబాబు, రాష్ట్ర టీడీపీ బీసీసెల్ అధికార ప్రతినిధి చుక్కా ధనంజయయాదవ్, మండల టీడీపీ అధ్యక్షుడురమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, తెలుగు మహిళా అధ్యక్షురాలు గుణభూషణమ్మ, వందలాది మంది టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో సినీ నటుడు సాయికృష్ణ

శ్రీకాళహస్తి,మే 14 ప్రభాతవార్త



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాల యంలో సిని నటుల సందడి చోటు చేసుకుంటుంది.ఈ నేపథ్యంలో మంగళవారం సినీ కథానాయకుడు కృష్ణసాయి కుటుంబసభ్యులతో స్వామి అమ్మవార్ల దర్శనానికి వచ్చారు. వారికి ఆలయాధికారులు దక్షిణ గోపురం వద్ద స్వాగతం చెప్పారు.ఆలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకోవాలని ఆలయాధికారులను కోరారు. ఆయనకు విఐపిలకు పూజలు నిర్వహించే సహస్రలింగేశ్వరుని ఆలయం వద్ద వేదపండితులతో ఏర్పాటు చేసారు.పూజల అనంతరం వారికి స్వామి అమ్మవార్ల ఆలయంలో అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద వారికి వేదపండితులతో ఆశీర్వచనాలు అందించారు.స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు.

## 18 నుంచి చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు

శ్రీకాళహస్తిరూరల్,14 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయాధికారి ఎస్ వి నాగేశ్వరరావు సోమవారం వివరించారు.పది రోజుల పాటు బ్రహ్మోత్సవాలను నిర్వహించుటకు సన్నాహాలు చేస్తున్నామని వివరించారు. చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య సారధ్యంలో ఉత్సవాలను నిర్వహించుటకు చర్యలు తీసుకుంటున్నామని ఇఓ తెలిపారు. ఊరందూరు గ్రామంలోని చెన్న కేశవ స్వామి ఆలయాన్ని చక్కగా ముస్తాబు చేసారు. విద్యుత్ దీపాల కాంతితో దేదీప్యమానంగా తీర్చి దిద్దారు.పది రోజులపాటు ఒక్కొక్క రోజు ఒక్కొక్క ఉత్సవాన్ని నిర్వహిస్తామని తెలిపారు. గ్రామస్థుల సహకారంతో నిర్వహించే బ్రహ్మోత్సవాలకుచుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో హాజరౌతారని వివరించారు.ఈ నెల 18 ఆదివారం అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమౌతాయని వివరించారు.పది రోజుల పాటు వాహన సేవలతో పాటు ఉభయదారులున్నారని వివరించారు. ఇటీవల ఆలయాన్ని జీర్ణోద్ధారణ గావించి కుంభాభిషేకం కూడా నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి రోజూ పగలు రాత్రి ప్రత్యేక వాహన సేవలుంటాయని ఇఓ నాగేశ్వరరావు తెలిపారు.ఈ మేరకు ఏర్పాట్లకు సంబంధించి ఇఓ చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్యతో సమీక్షించారు. ఉత్సవాలను అంగరంగవైభవంగా నిర్వహించుటకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

### ఉత్సవాల వివరాలు:

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ఊరందూరులోని చెన్న కేశవ స్వామి ఆలయంలో జరుగు బ్రహ్మోత్సవాలకు సంబందించి ఇఓ వివరించారు. ఈ నెల 18న అంకుర్పారణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమౌతాయని తెలిపారు. 19న ధ్వజారోహణం, 20న తిరుచ్చివాహన,శేష వాహనం, 21న తిరుచ్చి ఉత్సవం, హనుమంత సేవ 22న ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి సింహావాహనం23న ఉదయం గిన్నెభిక్ష మోహినీ ఉత్సవం రాత్రి గరుడ సేవ 24న ఉదయం తిరుచ్చి ఉత్సవం రాత్రి కళ్యాణోత్సవం,గజవాహన సేవ25న ఉదయం వసంతోత్సవం, రాత్రి రథోత్సవం, 26న ఉదయం తిరుచ్చి ఉత్సవం,రాత్రి పల్లకి సేవ, 27న ఉదయం పార్వేట ఉత్సవం అశ్వవాహన సేవ ధ్వజారోహణం,28న ఉదయం శాంతి అభిషేకం, రాత్రి ఏకాంత సేవ నిర్వహించబడుతుందని దేవస్థానం ప్రకటించారు.

## నాగంవాండ్లపల్లె వద్ద ఏనుగుల గుంపు దాడులు

**-10 ఎకరాల వరి పంట ధ్వంసం**



ఐరాల, మే 14 ప్రభాతవార్త: మండలంలోని నాగంవాండ్లపల్లె సమీపంలోని పంటపొలాలపై ఏనుగుల గుంపు సోమవారం రాత్రి దాడుల చేసి పలువురు రైతులకు చెందిన పంట పొలాలను ధ్వసం చేశాయి. మండలంలోని రంగమ్మచెరువు సమీపంలోని అటవీ ప్రాంతం నుండి ఏనుగుల గుంపు సోమవారం రాత్రి నాగంవాండ్లపల్లె భజనబండ పరిసరాలకు చేరుకుని పంటలపై దాడులు చేశాయి. ఈసందర్భంగా రంగమ్మచెరువుకు చెందిన రఫీ, ఖయ్యూం సాగుచేసిన వరి పంటను ధ్వసం చేశాయి. అలాగే నాగవాండ్లపల్లెకు చెందిన చెందిన కె.దేవరాజులు, ఎస్.దేవరాజులు, ఎన్.రాఘవేంద్ర, రమేష్, డి.బాబు, వెదర్లపల్లెకు చెందిన సుధాకర్‌కు చెందిన వరి పంటలను ధ్వంసం చేశాయి. ఈఏనుగుల గుంపు దాడుల్లో సుమారు 10 ఎకరాల మేర వరిపంట ఏనుగుల గుంపు తొక్కివేయడంతో లక్షల్లో రైతులకు నష్టం జరిగినట్లు బాధిత రైతులు వాపోయారు. ఏనుగుల గుంపును తరమడానికి ప్రయత్నించినప్పటికి ఫలితం లేకపోవడంతో రైతులు మిన్నకుండిపోయారు. ఇదిలా వుండగా తరచూ మండలంలోని పలు ప్రాంతంలోని గ్రామాల రైతుల పంట పొలాలపై ఏనుగుల దాడులు చేసి పంటలకు నష్టం కలిగిస్తుడడంతో రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# కూచివారిపల్లి గ్రామస్థులపై విచక్షణారహిత భౌతికదాడులు

**సర్పంచ్ అనుచరుల భయానక వీరంగంతో ప్రతిదాడులు -ఎంఎల్ఏ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వాహనం దగ్ధం - సర్పంచ్ కెసిఆర్ ఇంటికి నిప్పు పెట్టిన గ్రామస్థులు..?**







చంద్రగిరి, మే 14 ప్రభాతవార్త: సార్వత్రిక ఎన్నికలు ముగిసిన రెండు మూడు గంటల వ్యవధిలోనే కూచివారిపల్లి గ్రామస్థులపై రామిరెడ్డిపల్లి సర్పంచ్ కొటాల చంద్రశేఖర్‌రెడ్డి అనుచరులు విచక్షణారహిత భౌతికదాడులతో రెచ్చిపోయారు. సోమవారం ప్రశాంతంగా జరిగిన ఎన్నికల పోలింగ్ సందర్భంగా కూచివారిపల్లికి చెందిన టిడిపి నాయకులపై కెసిఆర్ అనుచరులు చేయి చేసుకున్నట్లు తెలిసింది. పోలింగ్ ముగించుకుని ఈవియంలను తరలించిన అనంతరం టిడిపి నాయకులు తమ గ్రామం కూచివారిపల్లికి చేరుకుని తమపై జరిగిన భౌతికదాడులను వివరించారు. దీంతో గ్రామస్థులు సర్పంచ్ వచ్చాక మాట్లాడ దామని ఊరడించారు. అయితే గ్రామస్థులు తన కోసం ఎదురు చూస్తున్నట్లు తెలుసుకున్న కొటాల చంద్రశేఖర్ రెడ్డి తన అనుచరులను పెద్ద సంఖ్యలో రామిరెడ్డిపల్లికి పిలిపించుకున్నారు. మద్యం మత్తులో వున్న కెసిఆర్ అనుచరులు కూచివారిపల్లికి చేరుకుని నిష్కారణంగా గ్రామస్థులు ఊహించని రీతిలో విచక్షణారహితంగా చావబాదారు. ఈ దాడుల్లో పలువురు గాయపడగా 7 మందికి తీవ్రగాయా లైనట్లు తెలిసింది. ఇక చేసేదిలేక తేరుకున్న గ్రామస్థులు తమను తాము రక్షించుకునేందుకై అక్కడే వున్న గులక రాళ్ళను వేసి తరుముకున్నారు. తన అనుచరులను పిలిపించిన కెసిఆర్ వారిపై కట్టడిని కోల్పో వడంతో పరిస్థితి విషమించింది. ఆపై వైసిపి ఎంఎల్ఏ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, హర్షిత్ రెడ్డి రామిరెడ్డిపల్లి చేరుకుని పరిస్థితిని తెలుసుకున్నారు. అదే విధంగా కూచివారిపల్లి పులివర్తి వినీల్ చేరుకుని గ్రామస్థులను పరామర్శించారు. పరిస్థితి తెలుసుకున్న టిడిపి ఎంఎల్ఏ అభ్యర్థి పులివర్తి నాని ఇక్కడికి చేరుకుని గ్రామస్థులను, గాయపడిన భాధితులను పరామర్శించారు. ఈ క్రమంలో పెద్ద సంఖ్యలో టిడిపి నాయకులు, కార్యకర్తలు వందలాధి మంది తరలిరావడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొన్నది. దీంతో పోలీసులు పెద్ద సంఖ్యలో ఇక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపుచేసేందుకు విశ్వప్రయత్నం చేశారు. ఇదిలా వుండగా మోహిత్ రెడ్డి కారుతో పాటు సర్పంచ్ నివాసానికి గ్రామస్థులు నిప్పు పెట్టారా, ఇక్కడికి చేరుకున్న టిడిపి క్యాడర్ నిప్పు పెట్టారా పోలీసు దర్యాప్తులో తేలాల్సి వున్నది. ప్రస్తుతం పోలీసుల పికెట్ ఏర్పాటు చేసి గ్రామంలో ప్రజలకు భద్రత కల్పిస్తున్నారు. తమ గ్రామంలో కొటాల చంద్రశేఖర్ రెడ్డిని తమలో ఒకరిగా భావించామనీ, ఏనాడూ కమ్మ, రెడ్డి అనుకోలేదని గ్రామస్థులు వాపోయారు. గతంలో కొటాల పద్మజను సర్పంచ్‌గా చేశామనీ, ఇప్పుడు కొటాల చంద్రశేఖర్ రెడ్డిని సర్పంచ్‌గా చేసుకున్నామని అన్నారు. అయినప్పటికీ తరచూ ఆయన వల్లనే తమ గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తున్నట్లు ఆవేదన చెందారు.

# రికార్డు స్థాయిలో పోలింగ్

**- చిత్తూరు పార్లమెంటు స్థానంకు 82.36 శాతం ఓట్లు**

**- 7 అసెంబ్లీ స్థానాల్లో 82.65 శాతం నమోదు**



చిత్తూరు, మే 14 ప్రభాతవార్త: సార్వత్రిక ఎన్నికలు-2024 పోలింగ్‌లో చిత్తూరు జిల్లా పోలింగ్ నమోదుకు రికార్డు నెలకొల్పింది. తిరుపతి, రాజంపేట జిల్లాలతో కంటే చిత్తూరు జిల్లాలో పోలింగ్ శాతం అత్యధికంగా నమోదు అయ్యింది. చిత్తూరు జిల్లాలో పార్లమెంటు ఎన్నికల్లో 82.36 శాతం పోలింగ్ నమోదు కాగా, అసెంబ్లీ ఎన్నికల్లో 82.65 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. తిరుపతి జిల్లాలో 76.83 శాతం పోలింగ్ నమోదు కాగా, రాజంపేట జిల్లాలో 76.12 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. చిత్తూరు జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో సైతం రికార్డు స్థాయిలో పోలింగ్ శాతం నమోదు అయ్యింది. ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం అసెంబ్లీ స్థానంలో రికార్డు స్థాయిలో 85.87 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యల్పంగా 79.34 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. అలాగే చిత్తూరు అసెంబ్లీ స్థానం పరిధిలో 80.65 శాతం పోలింగ్ నమోదు కాగా, జిడినెల్లూరు అసెంబ్లీ స్థానంలో 82 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. అలాగే నగరి అసెంబ్లీ స్థానంలో 81.15 శాతం పోలింగ్ నమోదు అయితే పలమనేరు అసెంబ్లీ స్థానం పరిధిలో 82.99 శాతం పోలింగ్, పుంగనూరు అసెంబ్లీ స్థానం పరిధిలో 82.25 శాతం పోలింగ్, పూతలపట్టు అసెంబ్లీ స్థానం పరిధిలో 85.35 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. అలాగే చిత్తూరు పార్లమెంటు స్థానం పరిధిలో 82.36 శాతం పోలింగ్ నమోదు కాగా ఇందులో చిత్తూరు అసెంబ్లీ స్థానం నుండి 80.65 శాతం పోలింగ్, పుంగనూరు అసెంబ్లీ స్థానం నుండి 80.25 శాతం పోలింగ్, నగరి అసెంబ్లీ స్థానం నుండి 81.15 శాతం పోలింగ్, జిడినెల్లూరు అసెంబ్లీ స్థానం నుండి 82 శాతం, పూతలపట్టు అసెంబ్లీ స్థానం నుండి 85.35 శాతం పోలింగ్, పలమనేరు అసెంబ్లీ స్థానం నుండి 82.99 శాతం, కుప్పం అసెంబ్లీ స్థానం నుండి 85.87 శాతం పోలింగ్ నమోదు అయ్యింది.

## నేటినుంచి శ్రీ తిరుపతి గంగమ్మ జాతర ఉత్సవాలు



కుప్పంరూరల్, మే 14 ప్రభాతవార్త : జిల్లాలో ప్రసిద్ధి చెందిన కుప్పం శ్రీ తిరుపతి గంగమాంబ అమ్మవారి జాతర ఉత్సవాలు బుధవారం నుంచి మొదలుకానున్నాయి. బుధవారం రాత్రి శ్రీ వినాయకస్వామి ఉత్సవం ఊరేగింపుతో ఉత్సవాలు మొదలవుతాయి. 16న గురువారం శ్రీ ప్రసన్న ముత్తుమారెమ్మ ఉత్సవం, 17న అన్నదానం, శ్రీ ప్రసన్న ముత్తుమారెమ్మ శేషవాహన ఊరేగింపు, 18న శ్రీ ముత్తుమారెమ్మ సింహవాహనం, 19న శ్రీ ముత్తుమారెమ్మ అశ్వవాహన ఊరేగింపు, 20న శ్రీ ప్రసన్న ముత్తుమారెమ్మ అగ్నిగుండ ప్రవేశం, పుష్పపల్లకి, బాణ వేడుకలు, 21న శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ అమ్మవారి శిరస్సు ఊరేగింపు, 22న శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ అమ్మవారి విశ్వరూప దర్శనంతో జాతర ముగియనుంది.

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల సందడి

**వేసవి సెలవులతో పెరుగుతున్న రద్దీ:**



శ్రీకాళహస్తి,మే 14 ప్రభాతవార్త : వేసవి సెలవులు, దక్షిణాది రాష్ట్రాల్లో పూర్తి అయిన ఎన్నికల సందడి, పరీక్షా ఫలితాల వెల్లడితో శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల రద్దీ పెరిగింది. మంగళవారం ఆలయంలో గణనీయంగా రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకున్నారు. సాధారణంగా గతంలో మంగళవారం రద్దీ ఉండేది కాదు.కానీ గత కొంత కాలంగా మంగళవారం మధ్యాహ్నం రాహుకాల సమయంలో రాహుకేతుదోష నివారణ పూజలకు విపరీతంగా భక్తులు హాజరౌతున్నారు. ఉదయం నుంచి చెంగల్వరాయ స్వామి ఆలయం వద్ద భక్తులు అభిషేకాలు జరిపించుకోగా మధ్యాహ్నం రాహుకాల సమయం నుంచి ఇక భక్తుల సందడే సందడి అన్నట్లు మారింది.ఈ నేపథ్యంలో ఆలయాదధికారులు కూడా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పర్యవేక్షిస్తున్నారు. కానీ ఆలయంలోని స్వామి అమ్మవార్ల గర్భగుడుల్లోని ఏసిలు పని చేయకుండా విఐపి భక్తులు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. ఈ విషయం ఆలయాధికారులకు తెలియనిది కాదు.కానీ కాంట్రాక్టర్లతోభయపడి పెదవి విప్పటం లేదు.

**గణనీయంగా రాహుకేతుదోష నివారణ పూజలు:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం కూడా గణనీయంగా రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకున్నారు. ఆలయాధికారులు అందించిన సమాచారం మేరకు 20వేల మంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు తెలిపారు.స్వామి అమ్మవార్ల అభిషేకాలు 55 జరిగినట్లు సమాచారం. కాగా ఏకాదశ మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు 19 జరిగాయని,రాహుకేతుదోష నివారణ పూజలు 3522 జరిగాయని ప్రత్యేక దర్శన టిక్కెట్లు కొనుగోలు చేసి ప్రవేశించిన విఐపిలు 1683 మంది ఉన్నారని వివరించారు.

## షార్ ప్రాజెక్టు ఎంప్లాయీస్... కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ స్వర్ణోత్సవాల సంబరం



శ్రీహరికోట (తడ), మే 14 ప్రభాతవార్త శ్రీహరికోటలోని షార్ ప్రాజెక్టు ఎంప్లాయీస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ స్వర్ణోత్సవాల వేడుకల్లో మహిళా ఉద్యోగులకు త్రోబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు త్రోబాల్ టోర్నమెంట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇప్పటిదాకా షార్ ఉద్యోగుల కోసం తమ క్రెడిట్ సొసైటీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను పలువురు వివరించారు. రైస్ ఏ ఛైల్డ్ అనాధ ఆశ్రమానికి బియ్యం బస్తాలు, పిల్లలకు కేకులు, చాక్లెట్లు పంచిపెట్టినట్లు సొసైటీ నిర్వాహకులు తెలిపారు. ఇదిలావుంటే ఈ సొసైటీ ఆధ్వర్యాన ఇప్పటికే శ్రీహరికోటలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ఉన్నారు.

## ఫలితాలపై 21 రోజులు నిరీక్షణ

కోట, మే 14 ప్రభాతవార్త : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఇంతటితో ఓటర్ల పని పూర్తయినా నాయకులు, అనుచరులకు మాత్రం ఫలితాలు రావాలంటే 21 రోజులు నిరీక్షణ తప్పదు. ఎన్నికల్లో పోలింగ్ ప్రక్రియ ఒక ఎత్తయితే ఆ తర్వాత ఫలితాలు వెంటనే వెలువడే అవకాశం లేకపోవడంతో ఫలితాలు వచ్చే వరకు నిరీక్షించడం నాయకులకు మరో ఎత్తవుతుంది. ఎన్నికలు ముగియగానే ఫలితాల కోసం ఎంతో ఆసక్తి, ఉత్కంఠతతో ఎదురు చూస్తున్నారు. దేశ వ్యాప్తంగా ఎన్నికలు పలు విడతల్లో జరుగుతుండటంతో అన్నిచోట్ల పూర్తయిన తర్వాతే జూన్ 4న ఫలితాలు వెలువడనున్నాయి. మహాసంగ్రామం లాంటి ఈ ఎన్నికల్లో ఫలితాల కోసం అభ్యర్థులతో పాటు సామాన్య జనం కూడా ఎదురు చూడక తప్పడం లేదు. 2019లో నిర్వహించిన ఎన్నికల్లో పోలింగ్ ముగిసిన తర్వాత 40 రోజులకు ఫలితాలు వెలువడగా, ఇప్పుడు 21 రోజుల పాటు వేచిచూడాల్సిందే. అభ్యర్థులకు అనుచరులకు తప్పదు అగ్నిపరీక్ష.

## యధేచ్ఛగా గ్రావెల్ సరఫరా





కార్వేటినగరం,మే 14 ప్రభాతవార్త: ఎర్రమట్టిని యధేచ్ఛగా సరఫరా చేస్తూ దండుకుంటున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.కార్వేటినగరం మండలంలోని కనికాపురం గుట్టప్రాంతం నుంచి ఎర్రమట్టిని వందల ట్రాక్టర్ల మట్టిని తరలిస్తున్నా రెవిన్యూ అధికారులు మామూళ్ళతో సరిపెట్టుకుంటున్నారే తప్ప నియంత్రించడం లేదని సమాచారం. కనికాపురం నుంచి కొల్లాగుంట చెక్‌పోస్టు సమీపంలో ఓ కళ్యాణమండపం స్థలానికి మట్టిని తరలిస్తున్నారు.ఒక్కో ట్రాక్టరు మట్టిని 700వరకు విక్రయించుకొని దండుకుంటున్నారని తెలుస్తుంది. ప్రభుత్వ మట్టిని ప్రభుత్వానికి ఏమాత్రం నగదును చెల్లించకుండా ప్రయివేటు వ్యక్తులకు విక్రయించి జేబులు నింపుకుంటున్నారని చెబుతున్నారు. మట్టి సరఫరా మండలంలో ఎక్కడపడితే అక్కడ గుట్టలను చదను చేస్తూన్న రెవిన్యూ అధికారులు తమకు పట్టనట్లు మామూళ్ళతో సరిపెట్టుకుంటున్నారని విమర్శ. కాగా ఈ విషయంపై జిల్లా అధికారులు సప్పంది. చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## భారీ భద్రత నడమ ఇవిఎం యంత్రాలు చిత్తూరుకు తరలింపు



కుప్పం, మే 14 ప్రభాతవార్త : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కుప్పం నియోజకవర్గంకు కేటాయించిన ఇవిఎం యంత్రాలను మంగళవారం భారీ భద్రత నడమ జిల్లా కేంద్రం చిత్తూరుకు తరలించారు. రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు, ఎఆర్ఓలు నాగేశ్వరరావు, హరికుమార్‌లు ఇవిఎం యంత్రాలను భారీ కంటైనర్లలో పోలీసుబలగాల మధ్య భద్రపరచారు. పోలీసు ఎస్కార్టు, సిఆర్‌పిఎఫ్ బలగాలు వెంటరాగా ఇవిఎం యంత్రాలు కలిగిన కంటైనర్లను చిత్తూరుకు తరలి ంచి ఎస్వీ సెట్‌లోని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు.

## రాష్ట్రంలో వైఎస్ఆర్సిపి ప్రభంజనం

**వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి**



వెంకటగిరి టౌన్, మే 14 ప్రభాతవార్త : రాష్ట్రంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఈ సారి కూడా వైసిపి ప్రభంజనం సృష్టించబో తుందని మరోసారి జగనన్న ముఖ్యమంత్రి కాబోతున్నారని వైసిపి తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసంలో ఎన్‌జెఆర్ భవనంలో మంగళవారం విలేకరి సమావేశం నిర్వహించారు. ప్రజల ఆశీస్సులు జగనన్నకు మెండుగా ఉన్నాయని ఈసారి కూడా ఆంధ్ర రాష్ట్రంలో వైఎస్ఆర్‌సిపి విజయటంక మోగిం చినట్లు తెలిపారు. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ స్థానాలు, 25 ఎంపి స్థానాలు వైఎస్ఆర్‌సిపి కైవసం చేసుకుంటుందని తెలిపారు. అదే విధంగా జగన్మోహన్‌రెడ్డి సూచనతో వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఈనెల 25వ తేదీన నామినేషన్ దాఖలు చేశానని అప్పటి నుండి సోమవారం జరిగిన ఎన్నికల వరకు కార్యకర్తల అభిమానులు తమకు వెన్ను దండగ ఉంటూ పార్టీ గెలుపు కోసం కృషి చేసినట్లు తెలిపారు. వారికి అందరికీ పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. అదే విధంగా వాలంటీర్ల సైతం రాజీనామా చేసి తమ గెలుపు కోసం పాటుపడ్డారని రాష్ట్రంలో జగనన్న సిఎం అయిన తర్వాత వాలంటీర్లకు మంచి భవిష్యత్తు ఉంటుందని భరోసా ఇచ్చారు. వెంకటగిరిలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేయడం ఆకతాయిల పని అని దానిని వెంటనే ఖండిస్తున్నట్లు ఆరోపించారు.

## పెట్రోల్ పోసి బోరు మోటారు.. డ్రిప్‌పైపులకు నిప్పంటించారు



రామకుప్పం, మే 14 ప్రభాతవార్త : ఎన్నికల సందర్భంగా తెలుగుదేశం పార్టీకి తాము బూత్ ఏజెంట్లుగా పనిచేశామనే కారణంగా తమ వ్యవసాయ పొలాల వద్ద ఉన్న బోరు మోటారు, పైపులైన్లకు పెట్రోల్ పోసి వైకాపా శ్రేణులు నిప్పంటించారని బాధితులు వాపోయారు. ఈసంఘటనకు సంబంధించి బాధితుల కథనం మేరకు వివరాలిలా.. మండలంలోని బళ్ల గ్రామంలో ఎన్నికలు జరిగాయని ఈ నేపథ్యంలో 96వ బూత్‌లో టిడిపి ఏజెంట్‌గా తాము పనిచేశామని వెంకటాచలం, రామేగౌడు పేర్కొన్నారు. దీన్ని జీర్ణించుకోలేక వైకాపా నేతలు బోరు మోటారు, స్టార్టర్, పైపులైను, అరటితోట, టమోటా డ్రిప్ పరికరాలకు నిప్పంటించారని పేర్కొన్నారు. దీంతో మూడు లక్షల మేర నష్టం కలిగినట్లు వాపోయారు. ఈమేరకు రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## బోయకొండ పరిపాలనా భవనంలో అగ్నిప్రమాదం

**-రూ. 3లక్షల ఆస్థినష్టం**



బోయకొండ(చౌడేపల్లి), మే 14 ప్రభాతవార్త : శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయ ముఖ్య పరిపాలనాధికారి కార్యాలయ భవనంలో అగ్ని ప్రమాదం సంభవించి, రూ. 3లక్షలు ఆస్థినష్టం వాటిళ్ళింది. కార్యాలయ అధికారుల కథనం మేరకు...అమ్మవారి ఆలయానికి సమీపంలోని పరిపాలనా భవనంలో మంగళవారం తెల్లవారు జామున నిప్పంటుకొంది. ఈ ప్రమాదంలో లోపలున్న అమ్మవారి ప్రతిమతోపాటు ఇఓ చాంబర్‌లోని విలువైన ఫర్నీచర్, ఎలక్ట్రానిక్ పరికరాలు, అద్దాలు పూర్తిగా కాలిపోయాయి. ఉదయాన్నే కార్యాలయ తలుపులు తెరచి చూసేసరికి జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఇటీవల ఇఓ కార్యాలయాన్ని నూతనంగా ఆధునీకరించారు. భవనంలో ఏర్పడ్డ విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ మూలంగానే ప్రమాదం సంభవించనట్లు అధికారులు వెల్లడించారు. అయితే సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంలో భవనంపై పిడుగు పడటం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందాని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని ఆలయ ఛేర్మన్ నాగరాజరెడ్డి, ఇఓ చంద్రమౌళిలు సందర్శించి వెంటనే పునర్నిర్మాణ చర్యలు చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు. కాగా అగ్నిప్రమాదానికి గల కారణాలను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆరా తీశారు.

# యువతను రాజకీయ దాస్యానికి ... బలిచేసిన 2024 ఎన్నికలు

**ప్రభాతవార్త, పుంగనూరు**

పుంగనూరు చరిత్రలోనే ఏడు దశాబ్దాల కాలంలో ఎన్నడూ, ఏ ఎన్నికలకూ లేనంతగా ఈదఫా 2024 సాధారణ ఎన్నికలకు పుంగనూరు చాలా కష్టాన్నే అనుభవించింది.1951లో ఒక సాధారణ వ్యక్తిని తమ నాయకుడిగా ఎన్నుకున్న ఈ నియోజకవర్గం, అపుడు ఆయన విజయం కోసం విరాళాలు కూడా ఇచ్చింది. ఇలా, ఎంతో ప్రశాంతంగా ఉండే పుంగనూరు, ఇపుడు రాష్ట్ర చరిత్రలో వివాదాస్పద నియోజకవర్గంగా మారిపోవడంతో పాటూ, రాష్ట్రంలోని సమస్యాత్మక నియోజకవర్గంగా కూడా సర్టిఫికేట్ సాధించేసింది. ఫలితాల మాట దేవుడెరుగు, ఈదఫా ఎన్నికలు మాత్రం ప్రతి కుటుంబానికి, ప్రతి ఓటరుకు చుక్కలు చూపించాయి. ఎక్కడ ఏం జరుగుతుందో తెలియక, ఎపుడు ఎవరిమీద ఎవరు దాడిచేస్తారో తెలుసుకోలేక జనం భయాందోళనలతో బెంబేలెత్తిపోయారు. విజయం కోసం అన్ని పార్టీల నాయకులు నానా అడ్డదారులు తొక్కడంతో పాటూ,ప్రతి వ్యవస్థను అడ్డంపెట్టుకున్నారు. ఇలా వ్యవస్థల్ని, వర్గాన్ని, కులాల్ని ఓట్లకుంపట్లతో రాజేసి ఊర్లలో చిచ్చుపెట్టిన ఎన్నికల పట్ల సాధారణ ప్రజలు ఏవగింపు ప్రకటిస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా ఐదేళ్ళలో పెరిగిపోయిన హింసాత్మక సంఘటనలు, దౌర్జన్యాలు, రియల్ ఎస్టేట్ దందాలు,ఆక్రమణలు ఇవన్నీ సాధారణంగా జీవించే ప్రజల జీవన విధానంపై దారుణ ప్రభావం చూపుతున్నాయి. ఫలితంగా నియోజకవర్గంలో ఇపుడు కొన్ని వేల కుటుంబాలు ప్రత్యర్థి పార్టీల దాడులకు గురికాగా, మరి కొన్ని వేలకుటుంబాల ప్రజలు ఈదారుణ సంస్కృతికి దూరంగా తమ బిడ్డలను ఇతర రాష్ట్రాలలో ఉంచి చదివిస్తూ పెంచుకుంటున్నారు. ఇప్పటికే దారుణమైపోయిన పరిస్థితులలో తమ బిడ్డలు పెరిగితే ఇక వారి భవిష్యత్తును కూడా రాజకీయపార్టీల మందలో కలిపివేయాల్సిఉంటుందని ఆయా కుటుంబాల తల్లితండ్రులు పిల్లలను ఊరిలోనే కాదు రాష్ట్రంలోనే ఉండకుండా పంపి చదివిస్తున్నారు. దీనికితోడు పుంగనూరు నియోజకవర్గంలో ఇపుడు రాజకీయ ఉద్యోగ కూలీలుగా మారిపోయిన వేలాది మంది కుటుంబాలలోని చదువుకున్న విద్యావంతులు రాజకీయాల ఉచ్చులో పడి,తల్లితండ్రులను కుటుంబాలను వ్యతిరేఖించి రాజకీయ నాయకుల కొలువుల్లో దినసరి కూలులుగా మారిపోయారు. వీరిని ఈవ్యసనం నుంచి దూరం చేయాలని యత్నిస్తున్న తల్లితండ్రులకు వీరు చుక్కలే చూపిస్తున్నారు. రాజకీయ కూలీలుగా మారిపోయిన విద్యావంతులు నిత్యం గొడవలకు సిద్ధమైపోతూ, పోలీసుకేసుల్లో కూడా నిందితులుగా మారిపోయారు. ఇందుకు ప్రధానంగా ఏ రాజకీయపార్టీను నిందించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే మూడు రాజకీయపార్టీలు కూడా ఇదే పంథాను అనుసరిస్తున్నాయి. మొత్తానికి రాజకీయాల దాస్యంలో కూరుకుపోయిన యువతతో పాటూ వేలాది కుటుంబాల పురుషులను ఇందులోనుంచి ఎలా వెలుపలకు తీసుకురావలో అర్థంకాక ఆయా కుటుంబాలు తల్లడిల్లుతున్నాయి.

రాజకీయాలను నమ్ముకుని,నాయకుల ఊడిగంలో ఉండిపోతున్న తమ ఇండ్లలోని పురుషుల వల్ల సేద్యం, పనీపాటా వదలిలేసి తిరుగుతున్న నమ్ముకున్నోళ్ళ ప్రవర్తనలు పలు కుటుంబాల విచ్ఛిన్నానికి కారణమౌతున్నాయి. ఏగొడవకు ఎవరు కారణమైనప్పటికీ, వందలాది కుటుంబాలలో భర్తలు, కొడుకులు, తండ్రులు ఇపుడు పోలీసుకేసులలో చిక్కుకుని దాక్కుని తిరుగుతుండగా, వందలాది మంది రిమాండ్ అనుభవాన్ని చవిచూశారు. నాయకులు, ప్రజల కుటుంబాల సంక్షేమానికి దారితీసే చర్యలతో ముందుకుసాగాల్సిఉండగా, రాజకీయపార్టీలు ప్రజలను ఇలా దారుణ పరిస్థితులలోనికి నెట్టివేయడం విచారకరం. ఇప్పటికైనా యువతతో పాటూ ఆయా కుటుంబాలకు చెందిన ప్రధాన వ్యక్తులు ఈరాజకీయ దాస్యమనే ఊబి నుంచి వెలుపలకు వస్తే..కనీసం తమను నమ్ముకున్న కుటుంబాలు బాగుపడుతాయి.